


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 316, పేజీలు - 08
బుధవారం, మే 6, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






# మమతా.. మడత పేచీ

## - మేము ఓడిపోలేదని తేల్చేసిన మమతా బెనర్జీ

- బెంగాల్ ఎన్నికల ఫలితాలను తిరస్కరించిన మమతా బెనర్జీ - 100 స్థానాలను అక్రమంగా దక్కించుకున్నారని ఆరోపణ
- ఎన్నికల అక్రమాలపై 15 మందితో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ - భవానీపూర్‌లో ఓడినా రాజీనామా చేయబోనని స్పష్టీకరణ
- గవర్నర్ ఏం చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి

**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించాయి. 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడుతూ బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించినప్పటికీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ఓటమిని అంగీకరించడానికి నిరాకరిస్తున్నారు. ఫలితాలు వెలువడి 24 గంటలు గడుస్తున్నా, ఆమె ఇంకా రాజీనామా చేయకపోవడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మమతా బెనర్జీ అత్యంత ఆవేశంగా మాట్లాడారు. మేము ఓడిపోలేదు, ఇది ప్రజల తీర్పును అపహాస్యం చేయడమే అని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్, కేంద్ర బలగాలు కుట్ర పన్ని ఓట్లను కొల్లగొట్టాయని, బీజేపీ విజయం అనైతికమని ఆమె మండిపడ్డారు. ఈ క్రమంలోనే నేను ఎందుకు రాజీనామా చేయాలి? మేము ఎన్నికల్లో ఓడిపోలేదు అంటూ ఆమె చేసిన ప్రకటన రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఈ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఒక విలన్ పాత్ర పోషించిందని, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను, ఈవీఎంలను లూటీ చేసిందని ఆమె మండిపడ్డారు. దేశ చరిత్రలో తాను ఇలాంటి ఎన్నికలను ఎప్పుడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటింగ్ ముగిసిన తర్వాత కూడా ఈవీఎంలలో 80 నుంచి 90 శాతం ఛార్జింగ్ ఉండటం ఎలా సాధ్యం? ఇది ముమ్మాటికీ అక్రమమే అని ఆమె ప్రశ్నించారు. ఎన్నికలకు రెండు రోజుల ముందు నుంచే తమ పార్టీ నాయకులను అరెస్టు చేయడం, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేయడం ద్వారా కేంద్రం కుట్రలకు తెరలేపిందని ధ్వజమెత్తారు. ఈ ఎన్నికలు బీజేపీకి, ఎన్నికల సంఘానికి మధ్య జరిగిన బెట్టింగ్ లా ఉన్నాయని మమత ఎద్దేవా చేశారు. మేము కేవలం ఒక రాజకీయ పార్టీతో కాదు.. మొత్తం వ్యవస్థతో పోరాడాము. ప్రధాని, హోం మంత్రులు నేరుగా జోక్యం చేసుకుని ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారు. బీజేపీ తన సొంత మనుషులను అధికారుల స్థానంలో కూర్చోబెట్టి ఈ ఆట ఆడింది అని ఆమె ఆరోపించారు. ఓటరు జాబితాలో భారీ అక్రమాలు జరిగాయని మమత పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా సుమారు 90 లక్షల మంది పేర్లను తొలగించారు. మేము కోర్టుకు వెళ్లిన తర్వాతే అందులో 32 లక్షల మంది పేర్లను మళ్ళీ చేర్చారు. ఇంతటి నీచమైన, మోసపూరితమైన రాజకీయాలను నేను నా జీవితంలో చూడలేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల్లో ఓడిపోలేదని, కుట్రపూరితంగా తమను ఓడించారని మమత స్పష్టం చేశారు. అధికారికంగా వారు మమ్మల్ని ఓడించి ఉండవచ్చు, కానీ నైతికంగా బెంగాల్ ప్రజల మద్దతు మాకే ఉంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి మా పోరాటం కొనసాగుతుంది అని ఆమె తేల్చి చెప్పారు. ఫలితాలు వెలువడిన వెంటనే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్, ఉద్ధవ్ థాకరే, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ వంటి అగ్రనేతలు తనకు ఫోన్

2లో..

### కాంగ్రెస్ మద్దతు కోరిన

# విజయ్

## -తమిళనాడు హస్తం పార్టీ చేతిలో నిర్ణయం



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ మేజిక్ ఫిగర్‌కు 10 సీట్ల వెనుకంజలో ఉండటంతో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడులో అధికారాన్ని చేపట్టేందుకు విజయ్ పార్టీకి ఇతర పార్టీల మద్దతు అవసరం అయింది. ఈ నేపథ్యంలోనే కలిసి వచ్చే పార్టీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విజయ్ పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా విజయ్ కాంగ్రెస్ పార్టీ మద్దతు కోరినట్లు హస్తం పార్టీ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. అయితే ఈ నిర్ణయాన్ని తమిళనాడు శాఖకే హైకమాండ్ అప్పగించినట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీన తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ

2లో..

# విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్

## - చిరకాల స్వప్నం నెరవేరిందన్న సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) సాగర తీర నగరమైన విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతో దోహదం చేస్తుందని నేతలు సంబరపడుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి తమ బిడ్డల భవిష్యత్ బాగుంటుందని స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు.

2లో..

### జై శ్రీరామ్ అంటే పైసలు

# పడతాయా.?

## - కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మంత్రి కొండా సురేఖ మరోసారి తన వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. బీజేపీ నేతలు కేవలం మతపరమైన నినాదాలకే పరిమితమవుతున్నారని, రాష్ట్ర ప్రయోజనాలను విస్మరిస్తున్నారని ఆమె మండిపడ్డారు. వరంగల్‌లో

2లో..

### మెట్రో ఫేజ్-2 విస్తరణపై

# కేంద్రంతో చర్చలు

## - నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణ ఊహాగానాలు మొదలయ్యాయి. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారనే ప్రచారంతో కాంగ్రెస్ సీనియర్ నేతలంతా హై అలర్ట్ అయ్యారు. నౌ అర్ నెవర్ అన్నట్టు కీలక పదవులు సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్యమంత్రి పర్యటన మాత్రం మంత్రివర్గ విస్తరణతోపాటు కేంద్రం వద్ద చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించనున్నారు. పనిలో పనిగా పార్టీలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టబోతున్నారని టాక్ నడుస్తోంది.

### మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు అనుమతులపై దృష్టి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధాన అజెండా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించిన అనుమతులు, నిధుల

2లో..



### దేవాదాయ శాఖ మంత్రి కాదు,

# దైవద్రోహ శాఖ మంత్రి

- మంత్రి కొండా సురేఖపై బీజేపీ తీవ్ర విమర్శలు
- దైవద్రోహ శాఖ మంత్రి అంటూ వ్యాఖ్యలు
- శ్రీరాముడిని అవమానించేలా మాట్లాడారని ఆరోపణలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీ నేతలను విమర్శించే క్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జై శ్రీరాం అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అగ్గి రాజేస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన, దాని కోసం బీజేపీ నేతలు చేస్తున్న ఏర్పాట్లపై తాజాగా స్పందించిన మంత్రి కొండా సురేఖ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు మీటింగ్ పెట్టి, జై శ్రీరాం అంటారని అలా చేస్తే డబ్బులు వస్తాయా, పథకాలు వస్తాయా అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దుమారానికి కారణం అయ్యాయి. దీనిపై కాషాయ పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో మంత్రి కొండా

2లో..

### పనితీరు ఆధారంగానే

# పార్టీలో పదవులు

- టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమం
- హాజరైన టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్
- కేడర్‌పై పెట్టిన అక్రమ కేసులన్నీ తొలగిస్తామని భరోసా



**అమరావతి (ప్రశ్న న్యూస్)** "ముఖ్యమంత్రి చంద్రబాబు, నేను ప్రభుత్వ పర్యటనలకు మా సొంత వాహనాలనే వినియోగిస్తున్నాం. వ్యక్తిగత విదేశీ పర్యటనలకు కూడా మా సొంత డబ్బునే ఖర్చు చేస్తున్నాం. మేము ప్రజలకు, పార్టీకి పూర్తి జవాబుదారీగా ఉంటున్నాం. కానీ ప్రత్యర్థులు పనిగట్టుకుని మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఫేక్ ప్రచారాన్ని వాస్తవ సమాచారంతో కార్యకర్తలు తక్షణమే తిప్పికొట్టాలి" అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పష్టం చేశారు.

2లో..

### రేవంత్‌రెడ్డి ప్రభుత్వం..

# రైతు హంతక ప్రభుత్వమే

## - మాజీమంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర వ్యాప్తంగా యూరియా అమ్మకాలపై బ్యాన్ విధించడం దిక్కుమాలిన చర్య అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. చరిత్రలో ఎన్నడూ ఇలాంటి నిషేధం విధించిన దాఖలాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే యూరియా అమ్మకాలపై నిషేధం మొదలైందన్నారు. యూరియా అమ్మకాలు నిలిపి వేస్తూ మౌఖిక ఆదేశాలు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా అమ్మకాలపై అనధికార బ్యాన్

2లో..

### ఏఐని సరిగ్గా వినియోగిస్తే

# అందరికి మేలు

- భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం - ఏఐని ఏకీకృతం చేయడంపై సాయం కోరిన సీఎం
- వైద్య విద్య సిలబస్ లో ఏఐ వినియోగం - పలు సూచనలు చేసిన రఘురాం రాజన్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కమిటీ వేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కమిటీకి అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ను సీఎం కోరారు. ఏఐని సరైన


2లో..



### సుప్రీంకోర్టులో

# పెరగనున్న జడ్జీల సంఖ్య

## - కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసుల భారాన్ని తగ్గించి, సత్వర న్యాయం

2లో..



# ఢిల్లీలో కూడా ఇలాగే గెలిచారు

## - బెంగాల్‌లో బీజేపీ గెలుపుపై స్పందించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఢిల్లీ తర్వాత, బెంగాల్‌లో కమలం పార్టీ విజయంపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీకి ప్రజాదరణ తగ్గుతున్న సమయంలో బీజేపీ బెంగాల్‌లోకి ఎలా ప్రవేశించిందో చెప్పాలని నిలదీశారు. మోదీ వేవ్ బాగా ఉన్న సమయంలోనూ ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాలలో బీజేపీ గెలవలేకపోయిందని అన్నారు. 2015లో ఢిల్లీలో, 2016లో బెంగాల్‌లో బీజేపీకి మూడు సీట్ల చొప్పున మాత్రమే వచ్చాయని గుర్తు చేశారు. కానీ మోదీ ప్రజాదరణ

2లో..

# మమతా.. మడత పేచీ

చేసి సంఘీభావం తెలిపారని మమత వెల్లడించారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ నాకు అండగా నిలిచాయి. మా ఐక్యత రాబోయే రోజుల్లో మరింత బలోపేతం అవుతుంది అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ నిన్నే కోల్‌కతా రావాలని భావించినప్పటికీ, నేడు రావాల్సిందిగా తానే కోరినట్లు ఆమె తెలిపారు. తన నిరాడంబరతను గుర్తు చేస్తూ మమత భావోద్వేగానికి లోనయ్యారు. నా జీవితమంతా ప్రజల సేవకే అంకితం చేశాను. ముఖ్యమంత్రిగా ఉన్న ఈ 15 ఏళ్లలో నేను ప్రభుత్వం నుంచి ఒక్క పైసా పెన్షన్ కానీ, జీతం కానీ తీసుకోలేదు. ఇప్పుడు నేను పూర్తిగా స్వేచ్ఛగా ఉన్నాను. ప్రజల కోసం ఏం చేయాలో, ఎలా చేయాలో నాకు తెలుసు ఖచ్చితంగా ఆ పని పూర్తి చేస్తాను అని ఆమె తేల్చి చెప్పారు.

### రాజ్యాంగం ఏం చెబుతోందంటే?

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ పదవీ కాలం మే ఏడో తేదీ వరకూ ఉంది. మే ఏడు తర్వాత బెంగాల్ అసెంబ్లీ పదవీ కాలం పూర్తవుతుందని ఆటోమేటిక్‌గా అసెంబ్లీ రద్దు అవుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో అప్పటి వరకూ గవర్నర్ వేచి ఉండే అవకాశం ఉంది, ఆలోగా మమతా బెనర్జీ తన నిర్ణయాన్ని మార్చుకుని రాజీనామా సమర్పిస్తే ఇబ్బందులు ఉండవు. అయితే దీదీ తన నిర్ణయానికే కట్టుబడి ఉంటే గవర్నర్ ఎదుట కొన్ని ఆప్షన్లు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

### ప్రభుత్వ రద్దు..

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్164 ప్రకారం ప్రభుత్వ రద్దు అధికారం గవర్నర్ చేతిలో ఉంటుంది. ముఖ్యమంత్రి అయినా, మంత్రివర్గమైనా గవర్నర్ ఆమోదం ఉన్నంత వరకే పదవిలో ఉండే అవకాశం ఉంది. ఎన్నికల ఫలితాల తర్వాత అధికార పార్టీకి మెజారిటీ రాలేదని నిరూపితమైనప్పుడు ముఖ్యమంత్రిని తొలగించే అధికారం, ప్రభుత్వాన్ని రద్దు చేసే అధికారం గవర్నర్‌కు ఉంది. ఒకవేళ తనకు బలముందని ముఖ్యమంత్రి వాదిస్తే శాసనసభను సమావేశపరిచి, బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ ఆదేశించవచ్చు. బల నిరూపణలో ఓడిపోతే ముఖ్యమంత్రిని తొలగిస్తారు.

### రాష్ట్రపతి పాలన..

మరోవైపు ఆర్టికల్ 356 ప్రకారం గవర్నర్ రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేయవచ్చు. ఇలాంటి గందరగోళ పరిస్థితులు తలెత్తినా, ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకున్నా కూడా రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేసే అధికారం గవర్నర్‌కు ఉంది. అయితే బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ 148 కంటే ఎక్కువ సీట్లు ఉన్న నేపథ్యంలో గవర్నర్ మమతా బెనర్జీని డిస్మిస్ చేసి బీజేపీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయి. మరి ముందు ముందు పశ్చిమ బెంగాల్‌లో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయనేదీ చూడాల్సి ఉంది.

# కాంగ్రెస్ మద్దతు కోరిన విజయ్

స్వీకారం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నేడు గవర్నర్‌ను కలిసి తన బలం గురించి వివరించనున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడిన తర్వాత ఆ రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. తాజాగా తాము టీవీకే పార్టీ నేతృత్వంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీని కోరినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. ఇక తాజాగా ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో జరిగిన హస్తం పార్టీ కీలక సమావేశంలో తమిళనాడులో టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చే అంశంపై చర్చ జరిగింది. విజయ్ చేసిన విజ్ఞప్తిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి అప్పగించింది. ఈ నేపథ్యంలోనే లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, ఇతర శక్తులను అడ్డుకోవడమే తమ ప్రాధాన్యత అని ఈ సందర్భంగా కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు.తాజాగా విడుదలైన ఫలితాల ప్రకారం విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 108 సీట్లతో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. మెజారిటీ మార్కు 118 సీట్లు కావాల్సి ఉండగా ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే పార్టీకి మరో 10 సీట్లు అవసరం కానున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ 5 సీట్లు సాధించగా ఆ పార్టీ మద్దతు ఇచ్చినప్పటికీ విజయ్‌కి ఇంకా మరో ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంటుంది. అందుకోసం పీఎంకే, ఐయూఎంఎల్ సహా ఇతర చిన్న పార్టీల మద్దతు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే చిన్న పార్టీలు, కాంగ్రెస్ పార్టీ మద్దతు కోసం విజయ్ సంప్రదింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్

ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్ విడుదలకు సహకరించిన ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం అవుతాయన్నారు.

### ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి దోహదం

వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రాన్ని మారుస్తుందని అభిప్రాయపడ్డారు. నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ జోన్ దోహదపడుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

### విశాఖ డివిజన్లో విలీనం

గుంతకల్లు డివిజన్ నుంచి "రాయచూర్ - వాడి సెక్షన్" సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయింది. రాయగడ నుంచి కొన్ని సెక్షన్లను విశాఖ డివిజన్లో కలుపుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. తాజా ఉత్తర్వులతో రాయగడ డివిజన్లో ఇంతకు ముందున్న పలాస-ఇచ్ఛాపురం రైల్వే లైన్, ఇచ్ఛాపురం-దువ్వాడ-విజయనగరం లైన్ను విశాఖ డివిజన్లో చేరాయి. అదే విధంగా నౌపడ -పర్లాకిమిడి, బొబ్బిలి-సాలూరు లైన్లు సింహాచలం-వడ్లపూడి, విశాఖ-జగ్గయ్యపాలెం రైల్వేలైన్లను విశాఖ డివిజన్లో విలీనం చేశారు. కోరాపుట్-కిరండోల్ లైన్ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించింది. ఈ మార్పులన్నీ జూన్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది. రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదలపై ఉత్తరాంధ్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జై శ్రీరామ్ అంటే పైసలు పడతాయా.?

జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, బీజేపీ నాయకులను ఉద్దేశించి చేసిన ప్రశ్నలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "మీటింగ్ పెట్టి జై శ్రీరామ్ అనడం తప్ప.. రాష్ట్రానికి తెచ్చిన నిధులు ఏవి?" అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు.

### హిందీ మాటలు.. కేవలం మీటింగులకే పరిమితమా?

బీజేపీ రాష్ట్ర నేతలు కేంద్రం వద్ద నోరు విప్పడం లేదని సురేఖ విమర్శించారు. బీజేపీ వాళ్లు కేవలం మీటింగులు పెట్టడం, జై శ్రీరామ్ అనడం తప్ప చేసేదేం లేదు. జై శ్రీరామ్ అంటే పైనుండి ఏమైనా పైసలు పడతాయా? లేక కొత్త పథకాలు వస్తాయా? మోదీ తో మీటింగ్‌లు పెట్టిస్తారు, నాలుగు హిందీ మాటలు మాట్లాడిస్తారు ఆ తర్వాత పంపేస్తారు. కానీ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే ఇక్కడి బీజేపీ మంత్రులు, ఎంపీలు నోరు మూసుకుని కూర్చొంటున్నారు అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

### బీజేపీ నేతల ఫైర్!

కొండా సురేఖ వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు తీవ్రంగా మండిపడుతున్నాయి. శ్రీరాముడి నామధేయాన్ని కించపరిచేలా ఆమె మాట్లాడారని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారు. గతంలో కూడా ఆమె రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయని, ఇప్పుడు భక్తిని కూడా రాజకీయాల్లోకి లాగడం ఆమె అవివేకానికి నిదర్శనమని వారు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### సోషల్ మీడియాలో ట్రోలింగ్

మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి అడగడంలో తప్పులేదు అని కొందరు ఆమెను సమర్థిస్తుంటే మరికొందరు మాత్రం భక్తికి, రాజకీయాలకు సంబంధం ఏంటి? నినాదాలను ఎగతాళి చేయడం తగదని అంటున్నారు.

కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో సెగలు రేపుతున్నాయి. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం నుండి నిధుల విషయంలో బీజేపీని టార్గెట్ చేస్తుండగా, మరోవైపు బీజేపీ తన హిందుత్వ అజెండాతో దాన్ని తిప్పికొట్టే ప్రయత్నం చేస్తోంది.

# మెట్రో ఫేజ్-2 విస్తరణపై కేంద్రంతో చర్చలు

సమీకరణ. నగర రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రూపొందించిన ఈ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ సాధించడం రేవంత్ రెడ్డి లక్ష్యం. ఇందు కోసం ఆయన పలువురు కేంద్రమంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అవసరమైన సహకారం కోరనున్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరుపై ఈ భేటీలు కీలక పాత్ర పోషించనున్నాయి.

### కేరళ విజయంతో పెరిగిన ప్రాధాన్యత

ఈ ఢిల్లీ పర్యటనకు మరో ముఖ్యమైన రాజకీయ కారణం కూడా ఉంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు దిశగా సాగుతోంది. ఈ విజయంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేరళలో ప్రచారం నిర్వహించిన రేవంత్ , అక్కడ పార్టీ విజయానికి తనదైన శైలిలో సహకరించారని అంటున్నారు. ప్రస్తుతం కేంద్ర ముఖ్యమంత్రి రేసులో ఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి వేణుగోపాల్‌కు మధ్య ఉన్న సన్నిహిత సంబంధాల దృష్ట్యా, ఈ విజయం రేవంత్ రెడ్డికి అధిష్ఠానం వద్ద మరింత పట్టును తెచ్చిపెట్టింది.

### కేబినెట్ విస్తరణ ఆశావహుల ఉత్కంఠ

రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం రెండు ఖాళీలు ఉన్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేయడంతోపాటు కొందరు మంత్రుల శాఖలను మార్చడం లేదా పని తీరు సరిగా లేని వారిని తొలగించే అవకాశం ఉందనే చర్చ గట్టిగానే సాగుతోంది. మే నెలలోనే ఈ మార్పులు ఉండవచ్చని సమాచారం. మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి లాంటి వారు తమకు గతంలో అధిష్టానం హామీ ఇచ్చిందని, ఈసారి మంత్రిపదవి ఖాయమంటున్నారు. ఎమ్మెల్సీ విజయశాంతి పేరు కూడా హైకమాండ్ పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఎస్టీ కోటాలో డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ లేదా దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. ఆది శ్రీనివాస్, మల్రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి ప్రేమ్ సాగర్ రావు లాంటి నేతలు కూడా మంత్రి పదవి కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి అయిన తర్వాత ప్రక్షాళన ఉంటుందని మరో వాదన కూడా ఉంది. అయితే ఖాళీగా ఉన్న రెండు స్థానాలను వెంటనే భర్తీ చేయాలని సీఎం పట్టుబడుతున్నారు.

### పార్టీ ప్రక్షాళనకు ప్రయత్నాలు

కేవలం కేబినెట్ మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీమ్‌ను కూడా మే నెలాఖరులోగా ప్రకటించే అవకాశం ఉంది. సామాజిక న్యాయం పాటించేలా మాదిగ, లంబాడ, మైనారిటీ వర్గాల నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించాలని అధిష్ఠానం యోచిస్తోంది. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్‌గా కొనసాగుతుండగా ఇతర కమిటీల్లో కొత్త ముఖాలకు చోటు కల్పించనున్నారు.

# దేవాదాయ శాఖ మంత్రి కాదు, దైవద్రోహ శాఖ మంత్రి

సురేఖపై విరుచుకుపడుతున్నారు.మంగళవారం రోజున హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాకు హాజరైన కొండా సురేఖ.. అక్కడ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కొండా సురేఖ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన తెలంగాణ బీజేపీ తీవ్రంగా మండిపడింది. 'దేవాదాయ శాఖ మంత్రి కాదు.. దైవద్రోహ శాఖ మంత్రి. శ్రీరాముడిపై మంత్రి కొండా సురేఖ అహంకారపూరిత వ్యాఖ్యలు' అంటూ విరుచుకుపడింది.జై శ్రీరామ్ నినాదాన్ని పైసలతో పోల్చుతూ కోట్లాది మంది హిందువుల మనోభావాలపై మంత్రి కొండా సురేఖపై విషం చిమ్మారని టీబీజేపీ ఫైర్ అయింది. హిందూ దేవుళ్లంటే కాంగ్రెస్ పార్టీకి ఉన్న చులకన భావానికి ఈ అహంకారపూరిత మాటలే సజీవ నిదర్శనమని పేర్కొంది. పవిత్రమైన దేవాదాయ శాఖకు మంత్రిగా ఉండి దైవాన్నే అవమానించడం దారుణమని మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ దేవుళ్లను కించపరచడమే కాంగ్రెస్ నాయకుల అసలు నైజమని ఆరోపించింది. శ్రీరాముడిని అపహాస్యం చేసిన కొండా సురేఖకు దేవాదాయ శాఖ మంత్రిగా కొనసాగే నైతిక అర్హత ఏమాత్రం లేదని తేల్చి చెప్పింది. శ్రీరాముడిని కించపరిచిన కొండా సురేఖ తక్షణమే హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.ఇక మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. హిందుత్వాన్ని విమర్శించడం ఇకపై అంత తేలికైన విషయం కాదని హిందువులు ప్రతిస్పందిస్తున్నారని పేర్కొన్నారు. ఆ ప్రతిఘటన ఇటీవలి ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ధర్మం తన మార్గాన్ని తాను వెతుక్కుంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. శబరిమల బంగారం చోరీ ఘటనలో పినరయి విజయన్, సనాతన ధర్మ నిర్మూలన వివాదంలో ఎంకే స్టాలిన్.. గంద ధర్మం, మృత్యు కుంభ్ వ్యాఖ్యలపై మమతా బెనర్జీ, తిరుమల వివాదంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, హిందూ బంధు అంటూ ఎగతాళి చేసిన విషయంలో కేసీఆర్ ఓటమి పాలైనట్లు బండి సంజయ్ గుర్తు చేశారు. ప్రతిసారీ విశ్వాసం అనేది రాజకీయ విమర్శలకు గురైనప్పుడు ఓటర్లు తమదైన రీతిలో సమాధానం ఇస్తున్నట్లు కనిపిస్తోందని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ మంత్రి జై శ్రీరామ్ నినాదాన్ని డబ్బుతో ముడిపెడితే ఆ తర్వాత ఏం జరుగుతుందో ఇప్పటికే ఉన్న ట్రెండ్ ద్వారా స్పష్టమవుతోందని వెల్లడించారు. ఈ సందర్భంగా పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.. జై శ్రీరామ్ భారత మాతా కీ జై అంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు.

# సుప్రీంకోర్టులో పెరగనున్న జడ్జీల సంఖ్య

అందించే లక్ష్యంతో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) మినహా మిగతా జడ్జీల సంఖ్యను 33 నుంచి 37కు పెంచనుంది. ఈ మేరకు "సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు, 2026"కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. న్యాయమూర్తుల సంఖ్య పెంపు ద్వారా సుప్రీంకోర్టు పనితీరు మెరుగుపడుతుందని, పెండింగ్ కేసుల విచారణ వేగవంతమవుతుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. దీనివల్ల కక్షిదారులకు సకాలంలో న్యాయం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. పెంచిన జడ్జీల జీతభత్యాలు, సిబ్బంది ఖర్చులు, ఇతర మౌలిక సదుపాయాల వ్యయాన్ని భారత సంఘటిత నిధి నుంచి భరించనున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(1) ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను నిర్ణయించే అధికారం ఉంది. ఈ నేపథ్యంలో 1956 నాటి చట్టాన్ని సవరించడం ద్వారా ప్రభుత్వం ఈ మార్పులు చేస్తోంది. గతంలో కూడా పలుమార్లు జడ్జీల సంఖ్యను పెంచారు. చివరిసారిగా 2019లో జడ్జీల సంఖ్యను 30 నుంచి 33కి పెంచారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనుంది.

# ఏఐని సరిగ్గా వినియోగిస్తే అందరికి మేలు

విధానంలో వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని రఘురాం రాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలపై జరిగిన సమావేశంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు సూచనలు చేశారు.యువత నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రఘురాం రాజన్ అన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్య తగ్గించుకోవాలని సూచించారు. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వాల సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి ఉంటాయని రఘురాం రాజన్ అన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందన్నారు.తమిళనాడు తరహా పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని రఘురాం రాజన్ తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. డేటా సెంటర్లకు విద్యుత్, నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ అభిప్రాయపడ్డారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు రాజన్ తెలిపారు. మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు రఘురాం రాజన్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన అన్ని సదపాయాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో సులభతర వ్యాపారానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సమావేశంలో సీఎస్ రామక్రిష్ణారావు, ఉన్నతాధికారులు శేషాద్రి, అజిత్ రెడ్డి, జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.పాఠశాల, ఉన్నత, సాంకేతిక, వైద్య విద్య పాఠ్యాంశాలలో ఏఐని ఏకీకృతం చేయడంపై సిఫార్సులు అందించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయడంలో సహాయపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్‌ను కోరారు. మధ్యస్థాయి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, అధునాతన శిక్షణా కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఏఐని సక్రమంగా వినియోగించడం వల్ల సమాజంలోని అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని రాజన్ పేర్కొన్నారు. పారిశ్రామిక వృద్ధికి అవసరమైన భూమి లభ్యత, పటిష్టమైన ప్రాథమిక సౌకర్యాలతో సహా అన్ని మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయని, భవిష్యత్ అవసరాలను తీర్చడానికి విద్యుత్ ఉత్పత్తిని విస్తరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో పాటు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ వంటి కీలక మౌలిక సదుపాయాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్ల కోసం ప్రణాళికలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.రాష్ట్రంలో పటిష్టమైన శాంతిభద్రతలు ఉన్నాయని, మొత్తం మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధిని సాధిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ మోడల్తో ముందుకు సాగుతోందని యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించామన్నారు. అధునాతన శిక్షణను అందించడానికి ఐటీఐలను ఏటీసీలుగా ఉన్నతీకరిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార సౌలభ్యానికి తెలంగాణ అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తోందని, ఫార్మా, ఐటీ, డేటా సెంటర్ల వంటి రంగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# రేవంత్‌రెడ్డి ప్రభుత్వం..రైతు హంతక ప్రభుత్వమే

ఎందుకు పెట్టారో ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. స్టాక్ ఉన్నా.. డీలర్లు, అగ్రో సెంటర్లు, సొసైటీల్లో రైతులకు యూరియా ఎందుకు ఇవ్వడం లేదు, యూరియా కోసం రైతులు తిరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని మాజీమంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.

### యూరియా అమ్మకాలపై బ్యాన్ విధిచడం దుర్మార్గం

యూరియా అమ్మకాలు నిలిపివేయడంతో చెరకు, పండ్ల తోటలు, కూరగాయలు పండించే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటుంటే ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా అని మాజీమంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాల్సింది పోయి, ఎరువుల కష్టాలను మరింత ఎక్కువ చేసేలా రూపొందించిన యాప్ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు.మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ఇప్పుడు ఏకంగా యూరియా అమ్మకాలపై బ్యాన్ విధించడం దుర్మార్గం అని మండిపడ్డారు.ఒకవైపు పెరిగిన ఎరువుల ధరలు, మరోవైపు యూరియాపై ప్రభుత్వ అనధికారిక బ్యాన్ రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా సరఫరాపై దృష్టి సారించడం మానేసి, యూరియా వినియోగం తగ్గించాలంటూ రైతులకు చెప్పడం, డబ్బులు వెచ్చించి ప్రచారం చేయడం హాస్యాస్పదం అని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు.

### రైతుబంధు ఇవ్వడంలో ఫెయిల్

ధాన్యం కొనుగోళ్లలో దారుణంగా విఫలమైన రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్ల ఒకవైపు రైతులు తీవ్ర ఆందోళనలో ఉంటే ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహిస్తుండటం వారిని అవమానించడమే అని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. 'రైతు బంధు ఇవ్వడంలో ఫెయిల్. బోనస్ చెల్లించడంలో ఫెయిల్. పంట బీమా పథకం అమలులో ఫెయిల్.రుణమాఫీ చేయడంలో ఫెయిల్. యూరియా సరఫరాలో ఫెయిల్. పంట కొనుగోళ్లు చేయడంలో ఫెయిల్. కొన్న పంటకు బోనస్ పైసలు ఇవ్వడంలో ఫెయిల్'అని మాజీమంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.'ఈ వైఫల్యాలను కవర్ చేసుకోవడానికి వారోత్సవాల పేరిట డ్రామా చేసినంత మాత్రాన రైతుల ఉసురు తీసుకుంటున్న పాపం రేవంత్ రెడ్డికి తగలకుండా పోదన్నారు.రైతు డిక్లరేషన్ పేరిట నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు.రైతులు నిలదీతకు బయపడి అధికారులు రైతు వేదికల నుంచి పారిపోయే పరిస్థితి రావడం మీ పాలనా వైఫల్యానికి నిదర్శనం అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వలే నిరంతరం యూరియా అమ్మకాలు కొనసాగించాలని, అనధికారిక బ్యాన్‌ను ఎత్తివేయాలని మాజీమంత్రి హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పనితీరు ఆధారంగానే పార్టీలో పదవులు

పార్టీ కేడర్ అత్యంత అప్రమత్తంగా ఉంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఉండవల్లిలోని నివాసంలో టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో లోకేష్ పాల్గొని, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలు అహంకారం ప్రదర్శించకుండా ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. "గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడానికి గొడ్డలి పార్టీ వారి అహంకారమే కారణం. మనం ఆ తప్పు చేయకూడదు. అహంకారం వీడి, సత్ప్రవర్తనతో, మంచి మాటలతో ప్రజల మనసులు గెలవాలి. అప్పుడు ప్రజలే మనల్ని మళ్లీ మళ్లీ గెలిపిస్తారు" అని హితవు పలికారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని లోకేష్ అన్నారు. "దేశంలోనే రూ.4 వేల పింఛను ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్. 'తల్లికి వందనం' కింద విద్యార్థులకు రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. పోలవరం పూర్తికావొస్తోంది, అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ కొనసాగింపు రాష్ట్రానికి చాలా అవసరం" అని ఆయన వివరించారు. పార్టీలో పనితీరే కొలమానమని, ప్రతి నాయకుడి పనితీరును అధినేత చంద్రబాబు ప్రతి మూడు నెలలకోసారి సమీక్షిస్తారని లోకేష్ హెచ్చరించారు. "పనిచేయని వారి పదవులు ఊడతాయని చంద్రబాబు గారు మాతో నిర్మొహమాటంగా చెప్పారు. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకుని పనిచేయాలి. పార్టీలో ఇప్పుడు కోటరీలు లేవు. సామాన్య కార్యకర్త సైతం నేరుగా అధినేతను కలిసే అవకాశం ఉంది" అని తెలిపారు.పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఏవైనా సమస్యలుంటే అంతర్గత వేదికలపైనే చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. "తెలుగుదేశంలో వ్యక్తులు కాదు, పార్టీయే శాశ్వతం. నాయకుల మధ్య విభేదాల వల్ల అంతిమంగా పార్టీ నష్టపోతుంది" అని అన్నారు. 2027 నాటికి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తానని, కేడర్‌పై పెట్టిన అక్రమ కేసులను పూర్తిగా తొలగిస్తామని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని లోకేష్ భరోసా ఇచ్చారు. బీజేపీ వంటి పార్టీలు దీర్ఘకాలం అధికారంలో కొనసాగేందుకు అమలుచేస్తున్న విధానాలను అధ్యయనం చేస్తున్నామని, పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ఢిల్లీలో కూడా ఇలాగే గెలిచారు

అట్టడుగు స్థాయికి పడిపోయిన ప్రస్తుత సమయంలో అవే ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాలలో ఎలా గెలిచిందో చెప్పాలని అన్నారు. జూళిబ్ధీల/-బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. మన దేశం ప్రస్తుతం అతిపెద్ద సంక్షోభంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2025 ఢిల్లీ ఎన్నికల్లో తన ఓటమిని ఈ సందర్భంగా గుర్తుజూళిబ్ధీల/ చేశారు. బీజేపీ ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేందుకు 'ఓట్ల తొలగింపు' అనే వ్యూహాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. 2025లో ఢిల్లీలో, ఇప్పుడు బెంగాల్‌లో జరిగింది ఇదే అని తెలిపారు.తాను జైలుకు వెళ్లకముందు తన నియోజకవర్గంలో 1.48 లక్షల ఓట్లు ఉండేవని, తాను తిరిగి వచ్చేసరికి అవి 1.06 లక్షలకు పడిపోయాయని తెలిపారు. కేవలం ఆరు నెలల్లో 42 వేల ఓట్లను తొలగించారని మండిపడ్డారు. అంతకుముందు ఎన్నికల్లో తాను 30 వేల ఓట్ల మెజారిటీతో గెలిచానని, కానీ ఓట్ల తొలగింపు తర్వాత మూడు వేల ఓట్లతో ఓడిపోవాల్సి వచ్చిందని అన్నారు. మహారాష్ట్ర సహా వివిధ రాష్ట్రాల్లో కూడా ఇలాగే జరిగిందని అన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని హెచ్చరించారు.

# బేతంచెర్లలో బిజెపి నాయకులు సంబరాలు

**బేతంచెర్ల** బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ బిజెపి నాయకులు నిన్న వెలబడిన పశ్చిమబెంగాల్,అస్సాం, పుదుచ్చేరి,రాష్ట్రాలలో బిజెపి ఎన్నికల విజయాన్ని సాధించడంతో బిజెపి జిల్లా కార్యదర్శిలు నాగ మోహన్,అంబాటి సుబ్బారెడ్డి,లు మంగళవారం బేతంచెర్లలో బానసంచ పేల్చి కేకు కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ రానున్న రోజులలో ఏపీ,తెలంగాణ,స్థానిక ఎన్నికలలోనూ తమ పార్టీని ఆదరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్ బాబు, ఉపేంద్ర,జీవన్ చౌదరి,అరుణ్,వసంత్, కన్యాకుమారి,మైనార్టీ మోర్చా షేక్ నూర్ అహ్మద్,తదితరులు పాల్గొన్నారు.

### ప్యాపిలి బిజెపి మండల ఇన్చార్జిగా

# జిల్లా కార్యదర్శి అంబాటి సుబ్బారెడ్డి

**బేతంచెర్ల :** ప్యాపిలి మండలం భారతీయ జనతా పార్టీ ఇన్చార్జిగా జిల్లా కార్యదర్శి బేతం చెర్ల మండలానికి చెందిన అంబాటి సుబ్బారెడ్డి,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మేరకు జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు,జిల్లా కార్యదర్శి నాగమోహన్,వివరాలు వెల్లడించారు.అంబాటి సుబ్బారెడ్డి,పార్టీకి చేసిన సేవలను గుర్తించి అధిష్టానం ఈ పదవిని అప్పగించినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా మండల నాయకులు,కార్యకర్తలు అంబాటి సుబ్బారెడ్డిని శాలువాతోఘనంగా సన్మానించారు.ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు రమేష్ బాబు, ఉపేంద్ర,జీవన్ చౌదరి,మనోహర్,వసంత్,అరుణ్, కన్యాకుమారి,సీనియర్ అడ్వకేట్ నంది పల్లె నారాయణ,మైనార్టీ మోర్చా షేక్ నూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

### దక్షిణ తీర రైల్వే జోన్

# ఏపీ అభివృద్ధికి మైలురాయి

**అమరావతి** భారత ప్రభుత్వం రైల్వే రంగంలో కీలక పరిపాలనా సంస్కరణలకు శ్రీకారం చుడుతూ "దక్షిణ తీర రైల్వే" (సౌత్ కోస్ట్ రైల్వే) అనే కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. రైల్వే చట్టం, 1989 కింద అధికారిక గెజిట్ ద్వారా ప్రకటించిన ఈ నిర్ణయం 2026 జూన్ 1 నుంచి అమల్లోకి రానుండడం సంతోషకరమన్నారు. ఈ జోన్ ప్రధాన కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారని ఆయన అన్నారు.ప్రస్తుతం ఉన్న ఈస్ట్ కోస్ట్ రైల్వే, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్‌లలోని కొన్ని డివిజన్‌లను పునర్వ్యవస్థీకరించి ఈ కొత్త జోన్‌ను రూపొందించడం సమర్థవంతమైన పరిపాలనకు దోహదం చేస్తుందని మాధవ్ తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని గుంతకల్, గుంటూరు, విజయవాడ డివిజన్‌లను కొత్త జోన్‌లో చేర్చడం, అలాగే ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్‌ను విభజించి విశాఖపట్నం డివిజన్‌గా మార్పు చేసి విలీనం చేయడం కీలక నిర్ణయాలుగా అభివర్ణించారు.

# రెడ్ సెల్యూట్ కారల్ మార్క్స్..!

**– భారత ఆధునిక సమాజ స్థాపన ‘ కమ్యూనిజం ’ తోనే సాధ్యం!!**

**– ప్రపంచ కార్మిక పీడిత ప్రజల ఆయుధం ‘మార్క్సిజం’ – రేణిగుంట సుందరయ్య భవనంలో ‘కారల్ మార్క్స్’ 208వ జయంతి!**

**రేణిగుంట** రేణిగుంట పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కారల్ మార్క్స్ 208వ జయంతి సందర్భంగా సీనియర్ కామ్రేడ్ వెంకటరమణ, హరినాథ్ ఆయన గురించి ఉపన్యాసం ఇచ్చారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఎం కార్యకర్తలు “రెడ్ సెల్యూట్.. కారల్ మార్క్స్” కమ్యూనిజం తోనే దోపిడీ సమాజాన్ని కూల్చుతాం! అంటూ నినాదాలు ఇచ్చారు.కార్ల్ మార్క్స్ 1818 మే 5 – 1883 మార్చి 14 జర్మన్ శాస్త్రవేత్త, తత్త్వవేత్త, ఆర్థికవేత్త, సామాజికవేత్త, పాత్రికేయుడు, సోషలిస్టు విప్లవకారుడు. ప్రస్తుత జర్మనీలోని ట్రయర్ పట్టణంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మార్క్స్, రాజకీయ ఆర్థికశాస్త్రం, హెగెలియన్ తత్త్వశాస్త్రం చదువుకున్నాడు. యుక్తవయస్సులో మార్క్స్ ఏ దేశపు పౌరసత్వం లేని స్థితిలో, లండన్లో జీవితం గడిపాడు. లండన్లోనే మరో జర్మన్ ఆలోచనాపరుడైన ఫ్రెడెరిక్ ఏంగెల్స్తో కలిసి తన చింతన అభివృద్ధి చేసుకుంటూ, పలు పుస్తకాలు ప్రచురించాడు. 1848 నాటి కరపత్రమైన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో వాటన్నిటిలోకీ సుప్రసిద్ధమైంది. తదుపరి కాలపు మేధో, ఆర్థిక, రాజకీయ చరిత్రను అతని రచన ప్రభావితం చేసింది.సమాజం, ఆర్థిక శాస్త్రం, రాజకీయాలు వంటివాటిపై మార్క్స్ సిద్ధాంతాలను కలగలిపి మార్క్సిజంగా పిలుస్తున్నారు. మార్క్సిజం ప్రధానంగా మానవ సమాజాలు వర్గ పోరాటాల ద్వారా అభివృద్ధి చెందాయని, పెట్టుబడిదారి వ్యవస్థలో ఇది సహజంగా పాలక వర్గాలకీ శ్రామిక వర్గాలకీ నడుమ ఘర్షణగా పరిణమిస్తుంది. పరాయీకరణ, విలువ, వస్తు మోహం, మిగులు విలువ వంటి తన సిద్ధాంతాల ద్వారా మార్క్స్ పెట్టుబడిదారి వ్యవస్థ వినియోగదారి మనసత్త్వం అభివృద్ధి చేయడం, సామాజిక అంతరాలు, శ్రమశక్తిని దోపిడీ చేయడం ద్వారా సామాజిక సంబంధాలు, విలువలను ఏర్పరుస్తోందని వాదించాడు. చారిత్రిక భౌతికవాదం అనే విమర్శనాత్మక దృక్పథాన్ని ఉపయోగించి, మార్క్స్ పునాది, పైనిర్మాణ సిద్ధాంతం ని ప్రతిపాదించాడు. సమాజంలోని సాంస్కృతిక, రాజకీయ స్థితిగతులను, అలానే వాటి మానవ స్వభావపు భావనలను ప్రధానంగా నిగూఢమైన ఆర్థిక పునాదులే నిర్ధారిస్తాయని ఈ సిద్ధాంతం చెప్తోంది. ఈ ఆర్థిక విమర్శలు 1867 నుంచి 1894 వరకూ మూడు భాగాలుగా ప్రచురితమైన ప్రభావశీలమైన దాస్ కాపిటల్లో పొందుపరిచారు.మార్క్స్ ప్రకారం, రాజ్యాలు ప్రజలందరి సాధారణ ఆసక్తులకు




అనుగుణంగా నడుస్తున్నట్టుగా చూపించుకున్నా, నిజానికి పాలకవర్గం ఆసక్తులకు అనుగుణంగా నడుస్తాయి. గత సామాజిక ఆర్థిక వ్యవస్థల్లాగానే పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్గత సమస్యలు స్వయం వినాశనానికి దారితీసి, దాని స్థానంలో కొత్త వ్యవస్థ ఐన సామ్యవాదం ఏర్పడుతుందని ఊహించాడు. మార్క్స్ అభిప్రాయంలో పెట్టుబడిదారీ వ్యవస్థలోని వర్గ వైరుధ్యాలు దాని అస్థిరతకు, సంక్షోభానికి గురయ్యే లక్షణానికి కొంత కారణమై క్రమంగా కార్మిక వర్గం వర్గ చైతన్యాన్ని సాధించడానికి దారితీస్తుంది, ఇది వారు రాజకీయ ఆధిపత్యాన్ని సాధించేందుకు, చివరకు ఉత్పత్తిదారుల స్వేచ్ఛా సంఘటితంగా ఏర్పడే ప్రభుత్వం ద్వారా వర్గ రహిత, కమ్యూనిస్టు సమాజం స్థాపనకు దారితీస్తుంది. మార్క్స్ కార్మిక వర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి, సామాజిక ఆర్థిక విముక్తి తీసుకువచ్చేందుకు సంఘటిత విప్లవ చర్య చేపట్టాలని వాదిస్తూ క్రియాశీలకంగా దాని ఆచరణ కోసం పోరాడారు. కార్ల్ మార్క్స్ మానవ చరిత్రలోకెల్లా అత్యంత ప్రభావశీలమైన వ్యక్తుల్లో ఒకరిగా పేరొందాడు, ఆయన కృషి, సిద్ధాంతం అటు ప్రశంసలు, ఇటు విమర్శలు కూడా విస్తృతంగా పొందింది.ఆర్థిక శాస్త్రంలో ఆయన కృషి శ్రమ గురించి, దానికీ పెట్టుబడికీ ఉన్న సంబంధం గురించి ప్రస్తుత అవగాహనకీ, తత్ సంబంధితమైన ఆర్థిక ఆలోచనకీ చాలావరకూ పునాదిగా నిలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా ఎందరో మేధావులు, కార్మిక సంఘాలు, కళాకారులు, రాజకీయ పార్టీలు మార్క్స్ ఆలోచనాధార, తాత్త్వికత, కృషిలకు ప్రభావితం అయ్యాయి, చాలామంది ఆయన ఆలోచనను స్వీకరించడమో, మార్పుచేసుకోవడమో చేశారు.

మార్క్స్ మరణించేంతవరకూ ఆయన భావాలు ప్రధానంగా వ్యాప్తి చెందకపోయినా, ఆయన మరణానంతరం వాటి ప్రభావం విస్తరించింది. రష్యన్ విప్లవం మొదలుకొని ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక విప్లవాలు మార్క్సిజం సిద్ధాంతం పునాదిగా చేసినట్టు ప్రకటించుకున్నాయి. 20వ శతాబ్దిలో అనేక దేశాలు మార్క్సిస్టు దేశాలుగా తమను ప్రకటించుకున్నాయి.ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు హరినాథ్, వెంకటరమణ, ఈశ్వరమ్మ, సెల్వరాజ్, రాజశేఖర్, దీప, భారతి, కుమారి, గీత, హేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్ రైతులకు అన్యాయం చేస్తోంది

## – కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ పోరాటం



**వరంగల్** బుధవారం వరంగల్ లోని హంటర్ రోడ్డు వద్ద నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సు సభా ప్రాంగణాన్ని సందర్శించిన తరువాత బీఆర్ఎస్ నేతలు రం మీడియాతో మాట్లాడారు.మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రేపు నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారు. నాడు కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగగా ఉండేది. ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం దండుగగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్డి ప్రభుత్వం. అధికారంలోకి వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ సర్కార్ రైతులకు అన్యాయం చేస్తోంది. గత రెండేళ్ల నుండి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాల వల్ల అష్టకష్టాలు పడుతున్న రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతోంది. ఎన్నికలకు ముందు ప్రజాపాలన అని అన్నారు? గద్దెనెక్కిన తర్వాత ప్రతీకార పాలన చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న రైతు సంగ్రామ సదస్సుకు పోటీగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు మేళాలు ఏర్పాటు చేశారు. మా బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు అనేక అవరోధాలను, అడ్డంకులను సృష్టించారు. కనీసం అవగాహన లేకుండా ఈ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. రైతులకు మద్దతుగా సదస్సు పెడుతుంటే మా బీఆర్ఎస్ కార్యకర్తలు కట్టిన పార్టీ తోరణాలు, ఫ్లెక్సీలు కాంగ్రెస్ ప్రభుత్వం తొలగిస్తుందని అన్నారు.శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం బీఆర్ఎస్ పోరాడింది. నాడు కేసీఆర్ ప్రభుత్వం రాకముందు తెలంగాణలో కేవలం 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే పండేది. కేసీఆర్ నాయకత్వంలో రైతుల కోసం తెచ్చిన అద్భుతమైన పథకాల వలన నేడు 3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతోంది. కేసీఆర్ రైతులను రాజు చేయాలని చూశారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది. పంటల కొనుగోళ్లను సైతం సరిగ్గా చేయకుండా అన్నదాతలను ఆవేదనకు గురి చేస్తుంది. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకోవాలని ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచిస్తున్నాం. కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతులు పడుతున్న గోసను తెలంగాణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. రైతు రుణమాఫీకి రూ. 36 వేల కోట్లు అవసరం అయితే.. కేవలం రూ. 18 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి ఈ కాంగ్రెస్ సన్నాసులు చేతులు దులుపుకున్నారు . కేసీఆర్ రైతుబంధును వరి నాట్ల ముందు క్రమం తప్పకుండా ఇచ్చేవారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతీగతీ లేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం మొక్కజొన్న పంట కొనుగోళ్లు చేపట్టడం లేదు. కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే వరంగల్ మార్కెట్ కు రండి.. ఇక్కడ పంటల కొనుగోళ్లు జరగట్లేదు. దమ్ము, సిగ్గు ఉంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కొనుగోలు సెంటర్ లకు వెళ్ళాలి. రైతు సమ్మేళనాలు కాదు రైతు సంక్షేమానికి పాటుపడండని అన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మళ్లోసారి ప్రజలకు గుర్తు చేసేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నాం. కేసీఆర్ రైతు బంధు పథకాన్ని ఆదర్శంగా తీసుకొని మోడీ సర్కార్ పీఎం కిసాన్ పథకం అమలు చేస్తున్నారు. కేసీఆర్ అమలు చేసిన ఎన్నో పథకాలను కాపీ కొడుతూ కేంద్రం ఇప్పటికే చాలా పథకాలు అమలు చేస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని అన్నారు.

# శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపు కోవాలి

**– ముస్లిం మత పెద్దలతో డిఎస్పీ కార్యాలయంలో సమావేశం అదనపు ఎస్పీ రాజేష్ మీనా**

**వనపర్తి** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వనపర్తి జిల్లాలో బక్రీద్, పండుగను సోదర భావంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా అన్నారు.బక్రీద్, పండుగ సందర్భంగా మంగళవారం రోజు వనపర్తి డిఎస్పీ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్, పండుగ శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మత సామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతపెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి జిల్లా పరిధిలో పశుసంవర్ధక శాఖ సిబ్బందితో 3 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉంటేనే, పరిశీలించి అనుమతిస్తారని అన్నారు.ప్రధానంగా నిబంధనలు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని ఏవరు కూడా తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ఏదైనా సమస్య వుంటే సామరస్య పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని అన్నారు. ముఖ్యంగా యువత ఆవేశంతో చేస్తున్న చిన్న తప్పులు శాంతి భద్రతల సమస్యగా తలెత్తె ప్రమాదం వుంటుంది కాబట్టి మతపెద్దలు యువతకు సమన్వయం పాటించేలా దిశానిర్దేశం చేయాలని అన్నారు.ప్రధానంగా జిల్లాలో ఏ చిన్న సంఘటన జరిగిన ఎడిటింగ్ చేసి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల ఐక్యతను, సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టడం



తద్వారా శాంతి భద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేస్తున్న వారిపై పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా పెట్టిందని తెలిపారు. సమావేశంలో ఇతర పోలీస్ అధికారులు కూడా పాల్గొని తమ తమ సూచనలు వెల్లడించారు. జిల్లాలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు పోలీస్ శాఖ మరియు ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పోలీసుశాఖ చర్యలను అభినందిస్తూ, శాంతి భద్రతలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, ముస్లిం మత పెద్దలు, యువకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలించిన కలెక్టర్ అంకిత్

**– సమస్యలు ఉంటే తెలపాలని లబ్ధిదారులకు సూచన**



**భద్రాద్రి బ్యూరో** జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని ఆకస్మికంగా పరిశీలించారు. బిల్లుల చెల్లింపుల స్థితిగతులు, క్షేత్రస్థాయి సమస్యలపై తనిఖీ నడుపుతూ, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. చర్ల మండలం పరిధిలో గల సత్యనారాయణపురం గ్రామంలో పర్యటించిన కలెక్టర్, ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిని స్వయంగా పరిశీలించారు. లబ్ధిదారులకు అందాల్సిన బిల్లుల చెల్లింపుల వివరాలు, నిధుల విడుదల ప్రక్రియలు అధికారుల నుంచి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ అంకిత్, “ఇళ్ల నిర్మాణాల్లో ఎటువంటి జాప్యం జరగకూడదు. నిధుల విడుదలలో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లేదా బిల్లుల చెల్లింపుల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.నిరుపేదల సొంతింటి కలను త్వరితగతిలో సాకారం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటన ద్వారా క్షేత్రస్థాయి సమస్యలు గుర్తించి, పరిష్కారాలు కనుగొనేందుకు దృష్టి పెట్టారు.

## అటవీ ప్రాంతాలలో ఎయిర్ గన్లతో వన్యప్రాణుల వేట: ఆరుగురు సభ్యుల ముఠా అరెస్ట్

**– నాలుగు ఎయిర్ గన్లు, ఒక లైసెన్స్డ్ రైఫిల్, 20 తూటాలు మరియు స్కార్పియో కారు స్వాధీనం**



**హైదరాబాద్** షాద్నగర్ మరియు మక్తల్ అటవీ ప్రాంతాలలో ఎయిర్ గన్లను ఉపయోగించి జింకలు, నెమళ్లు, కుందేళ్లు, కముజు పిట్టలు మరియు పావురాలను అక్రమంగా వేటాడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను కమిషనర్ టాస్క్ఫోర్స్ (గోల్కొండ టీమ్) మరియు అటవీ శాఖ అధికారులు సంయుక్త ఆపరేషన్లో అరెస్ట్ చేశారు.

నిందితుల నుండి వేట వీడియోలు ఉన్న మొబైల్ ఫోన్లు మరియు భారీగా మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు.నిందితులు మొహమ్మద్ ముజఫర్ హుస్సేన్ ఏ గుడ్డు, మీర్ అహ్మద్ అమీర్, అబ్దుల్లా బిన్ సహైన్, సౌద్ బిన్ మొహమ్మద్ బలాబ్, మసూద్ బిన్ మొహమ్మద్, కె. శేఖర్ (38) అను అరెస్టు చేసారు. వీరి నుంచి నాలుగు ఎయిర్ గన్లు, ఒక లైసెన్స్డ్ స్పోర్టింగ్ రైఫిల్ (.30-06 ఔఖః) మరియు 20 బుల్లెట్లు, ఒక స్కార్పియో కారు, ఎనిమిది మొబైల్ ఫోన్లు , ఒక బటన్ నైఫ్ స్వాధీనం చేసుకున్నారు.

## కొండపల్లిలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై దాడి



**ఎన్టీఆర్** కొండపల్లి శాంతినగర్ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం గోదాంపై అధికారులు దాడి నిర్వహించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు మరియు రెవెన్యూ శాఖ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్లో భారీగా బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నారు.శాంతినగర్లోని అభినందన ఫ్లాట్స్లో సుమారు 600 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం పీడీఎస్ ఎస్ డీటీ రామకృష్ణ మాట్లాడుతూ, స్వాధీనం చేసుకున్న బియ్యం నిల్వలపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని తెలిపారు.ఈ కేసులో అక్రమ రవాణాకు సంబంధించి దేరంగుల గోపిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.

## భార్యకు విషమిచ్చి చంపిన భర్త

**కడప** ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డి నగర్ లో భద్రిపల్లె పద్మ ను ఆమె భర్త బద్రి పల్లి కిరణ్ విషమిచ్చి చంపిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ విభూ కృష్ణ తెలిపారు. ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భార్య లావుగా ఉందని , ఎక్కువ తిండి తింటుందని దానివల్ల చంపినట్లు చెప్పారన్నారు... ఎనిమిదేళ్ల క్రితం వివాహమైందని భద్రిపల్లె కిరణ్ ముద్దనూరులోని వారి మామ ఇంటిలోనే ఉంటున్నాడని , ఏడు సంవత్సరాల కుమార్తె కూడా ఉందన్నారు. భార్యని ఎలాగైనా చంపాలని భావించిన భద్రి పల్లి కిరణ్ నెట్లో సెర్చ్ చేసి 80 వేలు విలువచేసే విష పదార్థాన్ని తెప్పించారన్నారు. భార్యను ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డి నగర్ లోని కిరణ్ తల్లిదండ్రుల ఇంటికి గత నెల 26వ తేదీన తీసుకొచ్చారన్నారు. విషాన్ని 29వ తేదీ రాత్రి భార్యకి విషమిచ్చి , ఆమె పడిపోయాక దిండు అదిమిపట్టి ఊపిరాడకుండా చేశారన్నారు. అతనికేమీ తెలియనట్లు భార్య కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారని వివరించారు. మృతురాలు తండ్రి ముద్దనూరు పట్టణానికి చెందిన బెంగుళూరు రాజకుల్లాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని , విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు..

# ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

**- ప్రధాని మోడీకి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి**

**- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్లకు సరఫరా చేసి రైతులు అదనపు ఆదాయం పొందాలి**

**- గంభీరావుపేటలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో శంకుస్థాపన**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకుప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామంలోని పంతులు తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ తో కలిసి భూమి పూజ చేశారు. అలాగే సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గం లోని 11 ప్రాంతాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కేవీ సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు.

తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం మొత్తం తీసుకోవాలని కోరారు. రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డీఎస్పీ నాగేంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణహిత చేవెళ్లకు జాతీయ హోదా ఇవ్వాలి

**- బయోగ్యాస్ ప్లాంట్లతో రైతులకు నూతన ఆదాయ మార్గం**

**- తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం : బట్టి విక్రమార్క**

**- పంట వ్యర్థాలతో ఆదాయం పెంచుకోవాలని రైతాంగానికి బట్టి పిలుపు**

**- గంభీరావుపేటలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**





**గంభీరావుపేట (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా,గంభీరావుపేటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ఆద్వర్యంలో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్‌కు మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లో రూ.30 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. రైతులను ఉద్దేశించి భట్టి విక్రమార్క మాట్లాడుతూ---రాష్ట్రం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రం పూర్తిగా తీసుకోవాలని,మద్దతు ధర ప్రకారం ప్రతి పంట కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్లకు అందించి అదనపు ఆదాయం పొందాలని రైతులకు సూచించారు. పంట మార్పిడి, ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు ద్వారా ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఆధునిక సాగు పద్ధతులు అవలంబిస్తేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డీఎస్పీ నాగేంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు చేయకపోతే రాజీవ్ రహదారి దిగ్బంధం



## - వంటేరు ప్రతాప్ రెడ్డి హెచ్చరిక

**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)**(సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో వరి కొనుగోళ్లలో ఆలస్యంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి, కొనుగోలు ప్రక్రియ, తూకం, సౌకర్యాలపై సమగ్రంగా తెలుసుకున్నారు.ఆయన మాట్లాడుతూ---రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పంటలు కొనుగోలు చేయడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని, కేంద్రాలలో గన్ని బ్యాగులు లేకపోవడం, లారీలు సమయానికి రాకపోవడం, రైస్ మిల్లర్ల ఆంక్షలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.వరి ధాన్యం దాదాపు 20 రోజులుగా రోడ్లపైనే ఉండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, 45 డిగ్రీల ఎండలో కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడదెబ్బ కారణంగా ఇద్దరు రైతులు మృతి చెందినా ప్రభుత్వానికి స్పందన లేదని విమర్శించారు.మక్కా, పొద్దుతిరుగుడు రైతుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని, మార్కెట్ యార్డుల్లో నెల రోజులుగా తిరుగుతున్నా కొనుగోలు జరగడం లేదని చెప్పారు. దీంతో రైతులు దళారులకు తక్కువ ధరలకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు."రైతు వారోత్సవాలు" పేరిట పండుగలు నిర్వహించడం కాకుండా, వెంటనే పంటలను కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తేమశాతం వంటి ఆంక్షలు లేకుండా రైతుల ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇకపోతే, రైతుల పంటలను తక్షణం కొనుగోలు చేయకపోతే రాజీవ్ రహదారిపై భారీ స్థాయిలో దిగ్బంధం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోమండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, స్థానిక సర్పంచ్ మిద్దెశివకుమార్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ ఎంపిటిసి బాలాజీ, సీనియర్ నాయకులు దోమల ఎల్లం,దర్గా సర్పంచ్ తేలు అశోక్,కోడెల రవి,లాగిశెట్టి జ్యోతి బాలస్వామి, ఉపసర్పంచ్ పల్లె జానకి యాదగిరి, ఆంజనేయులు,కొమ్ము స్వామి,ఎండీ నవీద్, రోడ్డ ప్రవీణ్, కొండల్ కుమార్, మిద్దె చంద్రమౌళి,మల్లేశం,పరిశరములు,శ్రీనివాస్ జైపాల్,ఎర్రబోయిన కనకయ్య,దోమల ఐలయ్య,జక్కుల శ్రీశైలం,నర్రా ప్రతాప్ రెడ్డి,చిక్కుడు భాను, పల్లె బాబు, మెరుగు శివ ,గుర్రాల రాజు, కటా పోచయ్య,ఎండీ నయీం, రైతులు నగరాజు, కృష్ణ,మల్లేశం, సుధాకర్, కురాతి నర్సింలు, మహిళా రైతులు,యాదమ్మ, బొజ్జ యాదమ్మ,గుండెల్లి కనకవ్వ, కోడెల లక్ష్మీ,సులోచనస్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# "రిచ్ కిడ్స్ ట్రాప్" కేసు దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్లోని జూబ్లీహిల్స్లో సంచలనం సృష్టించిన "రిచ్ కిడ్స్ ట్రాప్" కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ముఠా నాయకుడు అర్జున్ తల్లిని, మేనమామను కూడా పోలీసులు అరెస్టు చేయడం విశేషం. ఇప్పటికే అర్జున్ సోదరుడు రాజీవ్ ను బెంగళూరులో అదుపులోకి తీసుకోగా, అర్జున్తో పాటు గ్యాంగ్లోని మరో నలుగురు సభ్యులను కూడా పోలీసులు పట్టుకున్నారు. నిందితులందరినీ విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల కథనం ప్రకారం.. అర్జున్, రాజీవ్ అన్నదమ్ములు ఇన్స్టాగ్రామ్లో ఖరీదైన కార్లు, విలాసవంతమైన జీవనశైలితో రీల్స్ చేస్తూ తాము కూడా "రిచ్ కిడ్స్" అన్నట్లుగా కలరింగ్ ఇచ్చేవారు. సోషల్ మీడియా ద్వారా ప్రముఖ కుటుంబాలకు చెందిన యువతులను టార్గెట్ చేసి, వారితో పరిచయాలు పెంచుకునేవారు. అనంతరం వారిని తమ లగ్జరీ కార్లలో షికార్లకు తీసుకెళ్లి, నమ్మించి లైంగిక దాడులకు పాల్పడేవారు. అంతటితో ఆగకుండా, బాధితులకు తెలియకుండా వీడియోలు చిత్రీకరించి, వాటిని అడ్డం పెట్టుకుని బ్లాక్మెయిలింగ్కు దిగేవారు. వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తూ బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసేవారు. ఈ దారుణాల్లో అర్జున్ తల్లి, మేనమామ కూడా సహకరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ముఠాలో మొత్తం పది మందికి పైగా సభ్యులు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పోలీసులు నిందితులను రిమాండ్కు తరలించి, లోతైన విచారణ జరుపుతున్నారు.

# గిరిజనులకు డ్రైవింగ్ లైసెన్సులు పంపిణీ



**ఆత్మకూరు :** ఆత్మకూరు మండలము పెద్ద చెరువులో నివసిస్తున్న గిరిజనులకు శాసనసభ్యులు బుడ్డ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా 42 మంది గిరిజనులకు డ్రైవింగ్ లైసెన్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమము ఆత్మకూరు మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో గిరిజనులకు లైసెన్స్ అప్లై చేసి లైసెన్స్ మంజూరు చేయడము జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవిలో జీవనం సాగిస్తున్న గిరిజనులకు డ్రైవింగ్ లైసెన్స్ సౌకర్యం కల్పించాలని ఉద్దేశంతో ఆర్టీవో చేసిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

గిరిజనులకు డ్రైవింగ్ లైసెన్స్ లేక వాహన ప్రమాద బీమాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సులు ఉంటే గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జీవనోపాధి మెరుగుపడుతుందని ఆశాభావము వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి మైనార్టీ నాయకురాలు షబానా, మరియు మండల టిడిపి నాయకులు పట్టణ నాయకులు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# పాలిసెట్ ఫలితాలు విడుదల

**విజయవాడ** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ -2026 ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం (మే 5న) ఉదయం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ఈ ఫలితాలను ప్రకటించారు. ఈ ఏడాది పాలిసెట్ పరీక్ష కోసం మొత్తం 1,77,581 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 1,63,008 మంది పరీక్షకు హాజరయ్యారు.

వీరిలో 1,48,950 మంది ఉత్తీర్ణత సాధించి పాలిసెట్ కాలేజీలలో ప్రవేశాలకు అర్హత పొందారు. ఏపీ పాలిసెట్ రిజల్ట్స్ కోసం క్లిక్ చేయండి ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే మెరుగైన ప్రదర్శన కనబరిచారు. పాలిసెట్ పరీక్ష రాసిన బాలికల్లో 93.57 శాతం మంది అర్హత సాధించగా, బాలురలో 89.88 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే, అల్లూరి సీతారామరాజు జిల్లా 99.11 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే అగ్ర స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో పోలవరం 95.46 శాతంతో, పార్వతీపురం మన్యం జిల్లా 93.45 శాతంతో నిలిచాయి.

# 72 శాతం మంది ఎన్డీఏ పాలనలోనే

ఇండియన్ పాలిటిక్స్ లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో ఘన విజయాలు సాధించడంతో దేశవ్యాప్తంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సంఖ్య 21కి చేరింది. ఇది బీజేపీకి ఒక చారిత్రక మైలురాయి. 2018లో సాధించిన రికార్డును మళ్లీ అందుకోవడమే కాకుండా, 1970ల చివరలో ఇందిరా గాంధీ హయాంలో కాంగ్రెస్ నెలకొల్పిన రికార్డును కూడా సమం చేసింది. 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పుడు బీజేపీ కేవలం 7 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. పక్కా వ్యూహాలు, సంస్థాగత పటిష్ఠత, బలమైన పొత్తులతో 2018 మార్చి నాటికి ఈ సంఖ్యను 21కి పెంచుకుంది. అయితే, ఆ ఆధిపత్యం ఎక్కువ కాలం నిలవలేదు. 2018 డిసెంబర్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్గఢ్లలో ఓటమితో ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సంఖ్య వేగంగా తగ్గింది. ఒకానొక దశలో 13 రాష్ట్రాలకు పడిపోయింది. 2024 లోక్సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ కోల్పోవడం కమలదళానికి పెద్ద ఎదురుదెబ్బగా భావించారు. హోంమంత్రి అమిత్ షా, పార్టీ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా తెరవెనుక వ్యూహరచనతో పార్టీ యంత్రాంగాన్ని తిరిగి గాడిలో పెట్టారు.2024 తర్వాత మహారాష్ట్ర, హర్యానా, బిహార్, ఒడిశా వంటి కీలక రాష్ట్రాలను ఎన్డీఏ తిరిగి కైవసం చేసుకుంది. తాజాగా అసోంలో హిమంత బిశ్వ శర్మ రెండోసారి అధికారం నిలబెట్టుకోవడం, పశ్చిమ బెంగాల్లో టీఎంసీని ఓడించడంతో ఎన్డీఏ మళ్లీ తన శిఖరాగ్ర స్థాయికి చేరింది. దీంతో గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు గంగానది ప్రవహించే అన్ని రాష్ట్రాలు (ఉత్తరాఖండ్, యూపీ, బిహార్, బెంగాల్) ఎన్డీఏ పాలన కిందకు వచ్చినట్లయింది. ఈ విజయాలతో దేశ జనాభాలో సుమారు 72 శాతం మంది ఇప్పుడు ఎన్డీఏ పాలనలో ఉన్న రాష్ట్రాల్లోనే నివసిస్తున్నారు. 2024 ఫలితాలను ఒక మేల్కొలుపుగా తీసుకుని, రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేయడంలో బీజేపీ అద్భుతమైన కమ్ బ్యాక్ కనిపించింది

## జూన్ 1 నుంచి దక్షిణ కోస్తా

# రైల్వే జోన్ కార్యకలాపాలు

విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కల సాకారమైంది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ను ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కొత్త జోన్ 2026, జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని నోటిఫికేషన్లో పేర్కొంది. దీంతో, భారతీయ రైల్వేలో దక్షిణ కోస్తా రైల్వే 18వ జోన్గా అవతరించనుంది. పునర్విభజన చట్టం-2014లో ఇచ్చిన హామీ మేరకు ఈ జోన్ను ఏర్పాటు చేశారు. ఈ కొత్త జోన్ పరిధిలోకి ప్రస్తుతం ఉన్న గుంతకల్, గుంటూరు, విజయవాడ డివిజన్లు వస్తాయి. అదేవిధంగా, ప్రస్తుత వాల్తేరు డివిజన్ను విభజించి, దానిలోని కొంత భాగాన్ని విశాఖపట్నం డివిజన్గా ఏర్పాటు చేసి కొత్త జోన్లో కలుపుతారు. మిగిలిన భాగాన్ని రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ను ఏర్పాటు చేసి, దానిని ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో ఉంచుతారు

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

**- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రతిభ చూపిన జిల్లా అధికారులకు అభినందనలు**

**- పీపీటీ ప్రదర్శన ద్వారా జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలు**




**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

గంభీరావుపేట మండల కేంద్రానికి డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, వస్త్ర పరిశ్రమ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం శాసన వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం మంగళవారం హాజరు కాగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందించి.. స్వాగతం పలికారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండిఫ నియోజకవర్గాలలో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా కొరకు కీలక నిర్ణయం తీసుకుంటూ, మొత్తం రూ. 30.05 కోట్ల అంచనా వ్యయంతో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక , ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా 10 నూతన 33/11ఖం విద్యుత్ ఉపకేంద్రముల శంకుస్థాపన, ఒక ఉపకేంద్రం ప్రారంభోత్సవం చేశారు.

### సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ప్రత్యేక దృష్టి

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ప్రత్యేక దృష్టి పెట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు. సిరిసిల్ల నేతన్నల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అధికారంలోకి రాగానే రూ. 300 కోట్ల బకాయిలను విడుదల చేశామని గుర్తు చేశారు. విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు రూ. 2 వరకు తగ్గించేలా ఎన్‌పీడీసీఎల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల నిధులు మంజూరు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రతి వారం బిల్లులు చెల్లించడం జరుగుతుందని వివరించారు. ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలో ముందు ఉన్న సందర్భంగా జిల్లా అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. రాష్ట్రంలో మొత్తం కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, కోటి ఆరు లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని, అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.రాష్ట్రంలో 52 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేసే అధికారులకు తప్పని సరిగా గుర్తించి ప్రభుత్వం అవార్డులు, రివార్డులు ఇస్తుందన్నారు. పని చేయని అధికారుల గురించి కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం

**- రైతు సంక్షేమమే ధ్యేయంగా పటిష్ట చర్యలు**

**- ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు**

**- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మాయ గార్డెన్ లో ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, అధ్యక్షతన నిర్వహించిన ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరుగుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు పై అవగాహన సదస్సు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ , వివిధ ప్రజాప్రతినిధులు అధికారులు రైతులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ,రాష్ట్ర గేయాలపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతులను అన్ని విధాల ఆదుకుంటుందని అన్ని రకాల సబ్సిడీలు ఆర్థిక, ఆధునిక సాంకేతిక రంగంలో నూతన పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరిచే దిశగా రైతులకు మేలు చేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది అన్నారు. రైతులు ప్రయత్నం చేయక పోతే భవిష్యత్తు లో భూమి మొత్తం నిస్సార మవుతుందని,తక్కువ పెట్టుబడి తో ఎక్కువ పంటలు పండించేలా రైతులు ముందుకెళ్లాలని, ఆర్గానిక్ పంటల సాగు పై రైతులు ద్రుష్టి పెట్టాలన్నారు.భూములను రక్షించి ప్రకృతి వ్యవసాయం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, పై అవగాహనా కలిపించు కోవాలన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా రైతు వారోత్సవాల కార్యక్రమాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఒకే పంట కాకుండా పంటల మార్పిడి చేయాలన్నారు. ఒకే పంటతో జరిగిన నష్టాన్ని అధికారులు రైతులకు వివరించాలన్నారు. పండ్లు కూరగాయలు పూలు లతో ఆయిల్ పామ్ పంటలను కూడా పండించడం ద్వారా అధిక లాభాలను అర్జించవచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటలో ఇతర పంటలను కూడా పండించవచ్చని, కోతుల బెడద నుండి పంటలను కాపాడడానికి ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ రైతుల బాగు కోరి ఆయిల్ ఫామ్ పంటను రాష్ట్ర ప్రభుత్వం పరిచయం చేసిందన్నారు ఈ పరిచయం దినదినాభివృద్ధి చెందుతూ. మన జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు అన్నారు.రైతులు ప్రస్తుతం ఉన్న పంటలే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపుతూ అభివృద్ధి దిశగా ముందుకు పోవాలన్నారు అంతర్ పంటలు వేస్తూ ఆయిల్ ఫామ్ సాగు చేస్తే లాభాలు బేశరతుగా ఉంటాయని ఈ సందర్భంగా వెల్లడించారు. మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నుముక అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని ప్రత్యామ్నాయ ఇతర పంటలపై రైతులు మొగ్గు చూపుతూ సాగు చేస్తూ అధిక లాభాలు ఆర్జించాలని తెలిపారు.అంతకుముందు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# మంథని డివిజన్ టీఎన్జీఓ నూతన కార్యవర్గం ఎన్నిక

**- అధ్యక్షునిగా నూకల శంకర్.**

**- ప్రధాన కార్యదర్శిగా పవన్ కుమార్.**

**- కోశాధికారిగా అనిల్ రెడ్డి.**







**మంథని( ప్రశ్న న్యూస్)** మంథని డివిజన్ టీఎన్జీవో నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయింది. మంథని లోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎనుకున్నారు. మంథని డివిజన్ టీఎన్జీవో అధ్యక్షునిగా నూకల శంకర్ జీ పీ ఓ, ప్రధాన కార్యదర్శిగా నడిపల్లి పవన్ కుమార్ పంచాయత్ సెక్రటరీ కోశాధికారిగా ఎడవల్లి అనిల్ రెడ్డి ఆర్ ఐ మిగతా హోదాలలో అరవింద్ ఏ ఇ ఓ జీవన్ వార్డెన్, రాజశేఖర చారి సర్వేయర్, అరుణ ఎస్ ఏ, రాములు, పోషం, బాబా, మహిత, రాజేష్, రాజు, మదన్ మోహన్ రెడ్డి, శ్రీనివాస్, రాకేష్, సాయి వంశీ కృష్ణ, రాజయ్య, శ్యామ్ కుమార్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ టీఎన్జీఓ మంథని శాఖ ఏకగ్రీవంగా ఎన్నికవడం సంతోషంగా ఉందని, ఉద్యోగులు సంఘాలకు బాసటగా నిలవాలని, టిఎన్జీఓ సంఘం ప్రతి ఉద్యోగి పట్ల బాధ్యతగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు అహర్నిశలు కృషి చేస్తుందని, ఎన్నికైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. మంథని అధ్యక్షులుగా ఎన్నికైన నూకల శంకర్ మాట్లాడుతూ మంథని శాఖ పరిధిలోని ఏ ఉద్యోగి సమస్యతో వచ్చినా భాధ్యత తీసుకుంటా అని , తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించే ప్రయత్నం తన సాయశక్తుల చేస్తానని తెలిపారు. జిల్లా సంఘం నాయకులు సందీప్ రెడ్డి, పవన్ కుమార్, ప్రేమ్ సాగర్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# నేడే ఎస్‌సి కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు

**- ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు విధిగా హాజరు కావాలి**

**- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల**

**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** ఎస్.సి. కార్పొరేషన్ 2025--2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆక్షన్ ప్లాన్‌లో భాగంగా వ్యక్తిగత రుణాల మంజూరీ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేడు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) భీమా జయశీల తెలిపారు.ఇంటర్వ్యూలు ఉదయం 11 గంటలకు బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలతో సమయానికి హాజరు కావాలని ఆమె సూచించారు.అభ్యర్థులు నిర్లక్ష్యం చేయకుండా ఇంటర్వ్యూకు తప్పనిసరిగా హాజరై, రుణాల మంజూరీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ స్పష్టం చేశారు.




# నర్సాపూర్ బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడే దిశగా చర్యలు చేపట్టాలి

**- తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి**




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మంగళవారం నరసాపూర్ పట్టణంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన, అపర్ణ, బి. వచన్ కుమార్ కమిషన్ సభ్యులు విస్తృతంగా పర్యటించారు. నర్సాపూర్ పర్యటనకు విచ్చేసిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతారెడ్డికి మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ స్వాగతం పలికారు.ముందుగా నరసాపూర్ పట్టణంలోవికాసం వికలాంగుల పునరావాస కేంద్రం సందర్శించి బాల బాలికల సంరక్షణ కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. శారీరక వైకల్యం కలిగిన వికలాంగ చిన్నారిని చూసి చే లించిన హృదయంతో ఆ చిన్నారికి ఆపరేషన్ ద్వారా వైకల్యాన్ని సరిచేసి పౌష్టికాహారం అందించి విద్యాబుద్ధుల నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు.భవిత కేంద్రాలు ఆదర్శవంతంగా పనిచేస్తున్నాయని చిన్నారులకు ఆటపాటలతో కూడిన నైపుణ్యాలు నేర్పుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. శివం పేట బేతని సంరక్షణ ఆశ్రమం పరిశీలించారు.ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి సారిస్తుందని కమిషన్ సభ్యులు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ బాలల హక్కుల ఉల్లంఘనలు, పౌష్టికాహార లోపం, మరియురాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, మెరుగైన విద్య, ఆరోగ్యం, మరియు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం పిల్లలపై దాడులను అరికట్టడానికి కమిషన్ కట్టుబడి ఉందని, ప్రతి 6 నెలలకు లేదా ఏడాదికి ఒకసారి సంరక్షణ కేంద్రాల పనితీరును సమీక్షిస్తామని కమిషన్ స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో మహిళా శ్రీ శిశు సంక్షేమ అధికారి హేమ భార్గవి, రామాయంపేట సిడిపిఓ స్వరూప, డిసిపిఓ నాగరాజు,జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాటి చెట్టు పైనుండి పడి మృతి చెందిన

# నేరెళ్ల మొగిలి గౌడ్

**- కుటుంబానికి 10 లక్షలు ఎక్స్ గ్రేషియా అందించి ఆదుకోవాలి**

**- గత ప్రభుత్వం లో ఇచ్చిన టాడి కార్పొరేషన్ నుండి ఇచ్చే చెక్కులను పునరుద్ధరణ చేయాలి**

**- కల్లుగీత కార్మిక సంఘం ములుగు జిల్లా కమిటీ అధ్యక్షులు రాష్ట్ర సహాయ కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్ జిల్లా కార్యదర్శిరాష్ట్ర కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్ గౌడ్**



**ములుగు(ప్రశ్న న్యూస్)** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామానికి చెందిన నేరెళ్ల మొగిలి గౌడ్ తన విధి నిర్వహణలో భాగంగాఈ నెల 4 న సాయంత్రం వృత్తి లో భాగంగా తాళ్లు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాద వాశాత్తు జారి కింద పడగ అక్కడికక్కడే మృతి చెందటం జరిగింది.ఈ సంఘటనతో మొగిలిగౌడ్ కుటుంబం అనాధాపాలైందని తక్షణమే ఆ కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా అందించి మొగిలి గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలనిరవిగౌడ్. శ్రీనివాస్ గౌడ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయలేదని వారు అన్నారు.

పెండింగ్లో ఉన్న 20 కోట్ల రూపాయాల్లో కల్లు గీత కార్మిక సంఘం అనేక పోరాటాల ఫలితంగా కేవలం మూడు కోట్లు మాత్రమే విడుదల చేశారని వారు అన్నారు తక్షణమే పెండింగ్లోనే ఎక్స్గ్రేషియాలు తక్షణమే ఇవ్వాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన టాడి కార్పొరేషన్ చెక్కులు పునరుద్ధరణ చేయాలని 10 లక్షలు జీవో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాళ్లు ఎక్కే ప్రతి ఒక్కరికి కాటమయ్య రక్షణ కిట్లు ఇవ్వాలని వారన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన

# డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ మరియు కౌడిపల్లి మండలాల్లో పల్లు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునే విధంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లపాటు రైతులు కొనుగోలు కేంద్రాలలో అష్ట కష్టాలు పడ్డారని, ఇప్పుడు అన్నదాతకు ఏ చిన్న ఇబ్బంది రాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, ప్రజా ప్రభుత్వం రైతుల కోసమే నిరంతరం పాటు పడుతున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌడిపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి రవీందర్, శ్రీశైలం యాదవ్, మన్నే శ్రీనివాస్, దాడిగా నరేష్,నాయకులు రైతులు తదితరులు పాల్గొనారు.

# 'జన నాయగన్'తో దళపతి విజయ్ సంచలనం ..

## సీఎం అయిన తర్వాత విడుదలవుతున్న తొలి సినిమా పై భారీ అంచనాలు




తమిళ స్టార్ హీరో జోసెఫ్ విజయ్ సినీ ప్రయాణంలో అత్యంత కీలకంగా నిలిచిన చిత్రం 'జన నాయగన్' ఇప్పుడు ఇండియన్ సినిమా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను తన ఆఖరి చిత్రంగా ప్రకటించిన విజయ్, ఇకపై పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఏర్పడింది. ప్రతిభావంతుడైన దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం అసలు ఎన్నికలకు ముందు విడుదల కావాల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. నిర్మాణంలో ఆలస్యం, రాజకీయ పరిస్థితులు, అలాగే అనుకోని అడ్డంకులు 'జన నాయగన్' ప్రయాణాన్ని కష్టతరం చేశాయి. ఇంతేకాకుండా, ఈ చిత్రానికి సంబంధించిన ఓటిటి డీల్ కూడా మధ్యలో నిలిచిపోయినట్లు ప్రచారం జరిగింది.

అదే సమయంలో సినిమాపై ఉన్న హైప్ కూడా కొంత వరకు తగ్గిందనే అభిప్రాయాలు వినిపించాయి. ఈ పరిణామాలన్నీ కలిసి సినిమా ప్రభావం తగ్గిపోయిందనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజా రాజకీయ పరిణామాలు 'జన నాయగన్'కు పూర్తిగా కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని పార్టీ ఘనవిజయం సాధించడంతో ఆయన అభిమానుల్లో అపారమైన ఉత్సాహం కనిపిస్తోంది. ఒక హీరోగా మాత్రమే కాకుండా, నాయకుడిగా కూడా విజయ్‌పై ఉన్న విశ్వాసం ఇప్పుడు మరింత బలపడింది. ఇప్పటికే గతంలో 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం' వంటి భారీ ప్రాజెక్ట్‌తో విజయ్ తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించారు. భారీ బడ్జెట్, భారీ అంచనాల మధ్య వచ్చిన ఆ సినిమా కూడా అనుమానాలను చెరిపేసి మంచి వసూళ్లు సాధించింది. ఇప్పుడు అదే స్థాయిలో, అంతకంటే ఎక్కువగా 'జన నాయగన్'పై అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా, ఒక నటుడు ముఖ్యమంత్రిగా మారిన తర్వాత విడుదలవుతున్న అతని ఆఖరి సినిమా కావడం ఈ చిత్రానికి అదనపు క్రేజ్ తీసుకొచ్చింది. అభిమానులు ఈ సినిమాను కేవలం సినిమాగా కాకుండా, ఒక భావోద్వేగంగా చూస్తున్నారు. తమ హీరో రాజకీయాల్లో విజయం సాధించిన ఆనందంలో, ఈ సినిమాకు అపారమైన ఓపెనింగ్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. బాక్సాఫీస్ ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'జన నాయగన్' ఓపెనింగ్స్ కోలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా రికార్డులు బద్దలు కొట్టే అవకాశముంది. మొదటి రోజు వసూళ్లు ఊహించలేనంత స్థాయిలో ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, వసూళ్లు ఎక్కడ ఆగుతాయో అంచనా వేయడం కూడా కష్టమవుతుంది.

# ఓటీటీలోకి తిరువీర్ 'పాపం ప్రతాప్'..


## స్ట్రీమింగ్ ఎప్పటినుంచంటే?



టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ నటుడు తిరువీర్ హీరోగా నటించిన లేటెస్ట్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'పాపం ప్రతాప్' ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రం సుమారు మూడు వారాల తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు వస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్' ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా మే 7 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఎస్పీ దుర్గా నరేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తిరువీర్ సరసన పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించగా, అజయ్ ఘోష్ కీలక పాత్రలో మెరిశారు. తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్న ప్రతాప్ అనే యువకుడికి, పెళ్లయిన మూడు రోజులకే తన భార్య దూరమవ్వడం.. ఆమె తనపై ఒక వింత ఆరోపణ చేయడం అనే ఆసక్తికరమైన పాయింట్‌తో ఈ సినిమా సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే సహజసిద్ధమైన కామెడీ మరియు భావోద్వేగాల కలయికతో రూపొందిన ఈ చిత్రం డిజిటల్ వేదికగా రాబోతుండడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పెద్ది ట్రైలర్ రిలీజ్ డేట్ ఫిక్స్..

## వరల్డ్ ఫస్ట్ షో ఎప్పుడు అంటే..!




మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ అభిమానులకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న భారీ అప్‌డేట్ వచ్చేసింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చివరకు విడుదల తేదీని ఖరారు చేసుకుంది. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ పాన్ ఇండియా చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఐదు భాషల్లో ఘనంగా విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్ కూడా విడుదలను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ చిత్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. అక్కడ వరల్డ్ ఫస్ట్ షో భారత కాలమానం ప్రకారం జూన్ 3 రాత్రి 9 గంటలకు ప్రదర్శించనున్నారు. దీనితో విదేశాల్లో ఉన్న తెలుగు ప్రేక్షకులు ముందుగానే ఈ సినిమా ఎంజాయ్ చేసే అవకాశం పొందుతున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ మే 7 నుంచి ప్రారంభం కానున్నాయి. రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ క్రేజ్ దృష్ట్యా ప్రీమియర్ షోలకే భారీగా టికెట్లు అమ్ముడవుతాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా యూఎస్ మార్కెట్‌లో ఈ చిత్రం రికార్డు స్థాయి ఓపెనింగ్స్ సాధించే అవకాశం ఉందని భావిస్తున్నారు. లేటెస్ట్ బజ్ ప్రకారం పెద్ది ట్రైలర్ ఈ మే 17 లేదా 18న రిలీజ్ చేయబోతున్నట్టు తెలుస్తుంది. ట్రైలర్ రిలీజ్ తర్వాత ఇక మూవీ ప్రమోషన్స్ వేగం పెంచుతారు. మధ్య మధ్యలో మూవీకి సంబంధించిన పాటలు, గ్లింప్స్ వదులుతూ సినిమాపై మరింత ఆసక్తి పెంచేలా ప్లాన్ చేస్తున్నారు. పెద్ది సినిమాకి వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తుండగా పాన్ ఇండియా లెవెల్లో చాలా గ్రాండ్ రిలీజ్ ని ఈ సినిమాకి ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. అలాగే శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ, జగపతి బాబు వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ స్టార్ కాస్టింగ్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. మరో ముఖ్య ఆకర్షణగా నిలిచేది సంగీతం. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. ఆయన మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేకమైన హైలైట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో భావోద్వేగాలు, యాక్షన్, మాస్ ఎలిమెంట్స్ కలగలిపి రూపొందుతున్న 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయం సాధిస్తుందా అనే ఆసక్తి అందరిలో ఉంది

# నేను డబ్బు మనిషిని కాదు ..

## ఇష్టం లేని పని చేయను: ఎల్బీ శ్రీరామ్



ఎల్బీ శ్రీరామ్ .. తెలుగు తెరపై రచయితగా .. నటుడిగా తనదైన హాస్యాన్ని పరిగెత్తించిన ప్రతిభాశాలి. ఆయన బాడీ లాంగ్వేజ్ ను .. డైలాగ్ డెలివరీని ప్రేక్షకులు ఇష్టపడుతూ ఉంటారు. 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఆయన తన కెరియర్ గురించిన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "రచయితగా ఉన్న నన్ను, నటుడిగా ఎక్కడికో తీసుకెళ్లి నిలబెట్టింది ఈవీవీ సత్యనారాయణ గారు. ఆయన చలవే ఇది" అన్నారు. "రచయితగా నా స్పీడ్ చూసి మా ఇంట్లో వాళ్లే చాలా కంగారు పడ్డారు. మున్ముందు వచ్చే సినిమాలకు ఏం రాస్తాడు? అని మా పెద్దన్నయ్య వాళ్లు టెన్షన్ పడేవాళ్లు. నేను మాత్రం అదే తపనతో దూసుకుపోయేవాడిని. నటుడిగా 500 సినిమాలు చేసి ఉంటాను. ఆ తరువాత ఎక్కువగా తెరపై కనిపించడం లేదు. నటుడు తెరపై కనిపిస్తూ ఉంటేనే ఆడియన్స్ గుర్తుపెట్టుకుంటారు. ఎందుకు కనిపించడం కాలేదని ఆలోచన చేసేంత తీరిక ఎవరికీ ఉండక పోవచ్చు. అందుకే షార్ట్ ఫిలిమ్స్ చేసుకుంటున్నాను" అని అన్నారు. "దర్శకుడిగా .. నిర్మాతగా నాదైన దారిలో కష్టపడుతున్నాను. నటుడిగా ఒకే విధమైన పాత్రలు వస్తున్నాయి. రొటీన్ గా అలాంటి పాత్రలే చేయడం నాకు ఇష్టం లేదు. నాకు ఇష్టం లేని పని కోటి రూపాయలు ఇచ్చినా చేయను. డబ్బు కోసం మాత్రమే వేషాలు వేయడానికి నేను డబ్బు మనిషిని కాదు .. కళాకారుడిని. అన్నిరకాల పాత్రలు చేయాలని ఉంటుంది. అలాంటి పరిస్థితి లేకపోవడం వలన, నా మనసుకు నచ్చిన దారిలో వెళుతున్నాను" అని చెప్పారు.

## 6 కోట్లతో 40 కోట్లు రాబట్టిన

# మలయాళ మూవీ ..



ఎవరైనా తమ ఫ్యామిలీ హ్యాపీగా ఉండాలని భావిస్తారు. ఎలాంటి వివాదాల జోలికి వెళ్లకుండా, ప్రశాంతంగా గడిచిపోవాలని కోరుకుంటారు. అలాంటి ఒక ఫ్యామిలీ ఒక హత్యకి కారణమైతే .. ఆ హత్యానేరం తమపై పడకుండా ఆ శవాన్ని మాయం చేయడానికి ట్రై చేస్తే ఎలా ఉంటుంది? అనే ఒక కథతో రూపొందిన మలయాళ సినిమానే 'భరత నాట్యం 2: మోహినీయాట్టం'. బ్లాక్ కామెడీ నేపథ్యంలో 2024లో 'భారత నాట్యం' అనే సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాకి మంచి ఆదరణ లభించింది. దాంతో ఆ సినిమాకి సీక్వెల్ గా 'భరతనాట్యం 2: మోహినీ యాట్టం' రూపొందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన ఈ సినిమాను విడుదల చేశారు. 6 కోట్లతో నిర్మితమైన ఈ సినిమా, 40 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టడం విశేషంగా చెప్పుకోవాలి. అలాంటి ఈ సినిమా, ఈ నెల 8వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు, తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి రానుంది. కథ విషయానికి వస్తే, శశి తండ్రి భరత్ నాయర్ చనిపోతాడు. అతనికి మరో ఫ్యామిలీ కూడా ఉందని తెలుసుకున్న శశి, వాళ్లను కూడా ఆదరిస్తాడు. ఆ సమయంలో వచ్చిన భరత్ నాయర్ పాత స్నేహితుడు గోవిందరాజు, ఒక విషయంగా ఆ ఫ్యామిలీని బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెడతాడు. అనుకోకుండా ఆ ఫ్యామిలీ చేతిలో చనిపోతాడు. అతను బయటపెడతానన్న ఆ నిజం ఏమిటి? ఆ శవాన్ని మాయం చేయడానికి వాళ్లు ఏం చేస్తారు అనేదే కథ.

# దాసరి నారాయణరావు గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైన మోహన్ బాబు



తెలుగు సినీ పరిశ్రమ గర్వించదగ్గ దర్శకుడు దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో 'డైరెక్టర్స్ డే 2026' వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్షన్ కింగ్ మోహన్ బాబు తన గురువు దాసరిని గుర్తుచేసుకుంటూ ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. దర్శకుడు అనే పదానికి నిలువెత్తు అర్థం దాసరి గారేనని, తండ్రి లాంటి వ్యక్తిని కోల్పోయాననే బాధ తనలో ఎప్పటికీ ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో ఉన్న తనను ఇండస్ట్రీకి పరిచయం చేసి, 'మోహన్ బాబు' అని నామకరణం చేసి ఈ స్థాయికి తెచ్చింది ఆయనేనని కొనియాడారు. ఇదే క్రమంలో డైరెక్టర్ అసోసియేషన్‌కు తన వంతుగా రూ.15 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. నటి జయసుధ మాట్లాడుతూ... ప్రపంచంలోని ఏ అవార్డు అయినా దాసరి గారి పేరిట ఇచ్చే అవార్డు కంటే గొప్పది కాదని పేర్కొన్నారు. ఎంతో మంది నటీనటులను స్టార్స్‌గా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ వేడుకలో బాబూమోహన్ తో పాటు పలువురు ప్రముఖులు కూడా పాల్గొని దాసరి గారితో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. పరిశ్రమలోని దర్శకులందరూ ఏకమై ఈ వేడుకను జరుపుకోవడం దాసరి గారికి ఇచ్చే నిజమైన నివాళి అని అతిథులు అభిప్రాయపడ్డారు.

# ప్రజలే చరిత్ర నిర్మాతలు,
# డబ్బు, అధికారం శాశ్వతం కాదు

**- ఎంపీ ఈటల రాజేందర్**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్,**మే 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు గజ్వేల్‌లో మంగళవారం రోజు విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు ఎన్నికల ఫలితాలు దేశంలోని రాజకీయ పార్టీలకు, నాయకులకు ఒక పెద్ద కనువిప్పు అని, డబ్బులు ఇస్తే తప్ప గెలవలేం అనే ఈ కలియుగంలో ఒక సామాన్య డ్రైవర్ కొడుకు జయకేతనం ఎగురవేయడం గొప్ప విషయం అన్నారు. 1983లో ఎన్టీ రామారావు ప్రభంజనాన్ని చూశాం, మళ్ళీ ఇప్పుడు తమిళనాడు ప్రజలు డబ్బు, అధికారాన్ని ఎదిరించి సామాన్యుడిని గెలిపించి 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అని, ధర్మాన్ని, శ్రమను నమ్ముకున్న వారే గెలుస్తారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ప్రజా పాలన ఎలా ఉండాలో తెలుసుకోవడానికి 32 ఏళ్లుగా ఒకే పార్టీని ఆదరిస్తున్న గుజరాత్ రాష్ట్రమే ఉదాహరణ అని, బెంగాల్‌లో కూడా నియంతృత్వ ధోరణి సాగదని ప్రజలు నిరూపించారని తెలిపారు. పదవిలోకి వచ్చిన రెండేళ్లకే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రభుత్వంతో పనులు కావని ప్రజలు కోర్టులకు వెళ్లే పరిస్థితి దాపురించింది అన్నారు. గత ఎన్నికల్లో కేసీఆర్ అహంకారం చూసే ప్రజలు ఆయన్ని ఓడించారని, ట్రయాంగిల్ కాంటెస్ట్ వల్ల మాత్రమే కొన్ని చోట్ల బీఆర్ఎస్ గెలిచిందని గుర్తు చేశారు. సుమారు యాభై ఏళ్లుగా బీజేపీ కార్యకర్తలు ఎదురుచూస్తున్న శుభతరుణం ఆసన్నమైందని అన్నారు. దేశ భద్రత, సమగ్రత కోసం ప్రజలు ఆలోచిస్తున్నారు. మన తెలంగాణ ప్రజల వేదన తీర్చడానికి, మనందరినీ ఆశీర్వదించడానికి ప్రధాని మోదీ వస్తున్నారు. మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభకు ప్రతి కార్యకర్త, సామాన్య ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, సీనియర్ నాయకులు కప్పర ప్రసాద్, భాస్కర్, శ్రీనివాస్, సింగం సత్తన్న, రామ్ రెడ్డి, జశ్వంత్ రెడ్డి, నందన్ గౌడ్, మల్లేష్, అశోక్ యాదవ్, సత్యనారాయణ, అశోక్ గౌడ్, ఐలయ్య యాదవ్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 15వ వార్డు అభివృద్ధికి
## కట్టుబడి ఉన్నాం: నక్క సంతోష రాములు గౌడ్



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని వార్డు కౌన్సిలర్ నక్క సంతోష రాములు గౌడ్ తెలిపారు. వార్డులో తాజాగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి సహకారంతో 15వ వార్డులో అంతర్గత సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాకుండా, ప్రతి లబ్ధిదారునికి రేషన్ కార్డులు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. రెండు పర్యాయాలు టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ వార్డులో ప్రాథమిక సదుపాయాలు కల్పించలేదని, అంతర్గత రోడ్లు మరియు మురికి కాల్వలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. గత పాలకవర్గం నిధుల వినియోగంలో పారదర్శకత లేకపోవడంతో అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. మున్సిపాలిటీలోనే 15వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు సాయశక్తుల కృషి చేస్తానని నక్క సంతోష రాములు గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోగిని లక్ష్మణ్, సంగీతం అశోక్ గౌడ్, మహంకాళి చంద్రయ్య, కృపానందం, శ్రావణ్, బడే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇచ్చి చైన్ స్నాచింగ్ చేసిన
## నిందితుడు అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ పరిధిలో లిఫ్ట్ ఇస్తానని మాయమాటలు చెప్పి మహిళపై చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని తొగుట సీఐ ఎస్.కే. లతీఫ్, దౌల్తాబాద్ ఎస్సై జి. అరుణ్‌కుమార్ వెల్లడించారు. వారి వివరాల ప్రకారం, ఏప్రిల్ 26న రాత్రి 8 గంటల సమయంలో దౌల్తాబాద్ శివాజీ విగ్రహం వద్ద ఒక మహిళ ఆటో కోసం ఎదురుచూస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తి గొడుగుపల్లి గ్రామానికి వెళ్తున్నానని చెప్పి తన మోటార్ సైకిల్‌పై లిఫ్ట్ ఇచ్చాడు. అనంతరం దీపంపల్లె గ్రామ శివారులోని కల్వర్ట్ వద్ద బండి ఆపి, పెట్రోల్ అయిపోయిందని చెప్పి మాయమాటలు చెప్పి మహిళ మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు తాడు, 2 గ్రాముల బంగారు చెవి కమ్మలు, 20 తులాల వెండి కాళ్ల పట్టీలు లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, రాయపోల్ మండలం రామారం గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీను (30)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు: 28.50 గ్రాముల బంగారు పుస్తెల తాడు (రెండు వరుసలు) 2.07 గ్రాముల బంగారు చెవి పోగులు 190.30 గ్రాముల వెండి పట్టి గొలుసులు నేరానికి ఉపయోగించిన హీరో గ్లామర్ బైక్ ఒప్పో మొబైల్ ఫోన్ కేసును చేధించిన దౌల్తాబాద్ ఎస్సై అరుణ్‌కుమార్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ విక్రమ్, నాగరాజు, స్వామిలను సీఐ లతీఫ్ అభినందించారు. లిఫ్ట్ ఇస్తామని చెప్పే అపరిచితుల మాటలు నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో కవిత



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** క్యాసారం గ్రామంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి స్పష్టమైన ఎజెండాతో ముందుకు సాగుతున్నామని ఆమె వెల్లడించారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని క్యాసారం గ్రామంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కవిత, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము చేపట్టిన ఎజెండా విజయవంతం కావాలని, తెలంగాణ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నట్లు తెలిపారు. రేణుక తల్లి దయతో రాష్ట్ర ప్రజలందరూ ఆనందంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, కుల సంఘం పెద్దలు పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అనుగుణంగా
## మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతాం

- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
- వర్చువల్ విధానంలో మాన్వాడ సబ్ స్టేషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేటలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని బోయినిపల్లి మండలం, మాన్వాడ గ్రామ సబ్‌స్టేషన్‌ను గంభీరావుపేట నుంచే వర్చువల్ విధానంలో మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించారు. చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం కొబ్బరికాయ కొట్టి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, మాన్వాడ గ్రామ సబ్‌స్టేషన్ ప్రారంభంతో ప్రాంతీయ రైతులు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మౌళిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ అంతరాయాలు తగ్గి, వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బోయినిపల్లి సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, జిల్లా అధికార యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు

## కోరెం ప్యాక్స్ చైర్మన్‌గా
## తీపిరెడ్డి కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

- రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతాం
- కోరెం ప్యాక్స్ చైర్మన్ : తీపిరెడ్డి కిషన్ రెడ్డి



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో గతంలో రద్దు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాలను తిరిగి పునర్నియమించాలని హైకోర్టు ఆదేశాల మేరకు, రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, కోరెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) చైర్మన్‌గా తీపిరెడ్డి కిషన్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాలక వర్గ సభ్యులు, అధికారులు, స్థానిక నాయకుల సమక్షంలో బాధ్యతలు చేపట్టి, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాలక వర్గ సభ్యులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అనుపట్ల తిరుపతి రెడ్డి, ఉమ్మెంతుల లక్ష్మారెడ్డి, పులి హనుమాండ్లు, మొగిలిపాలెం నర్సయ్య, పెండ్యాల కృష్ణారెడ్డి, మల్లారపు రవి, జంగం నీరజ, మాజీ వార్డు సభ్యులు సామ రవీందర్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి దిలీప్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సెస్సీ విద్యార్థుల ప్రతిభకు
## సర్పంచ్ ఏనుగుల కనుకయ్య అభినందనలు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** ఇటీవల ప్రకటించిన ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో విలాసాగర్ గ్రామానికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పరీక్షల్లో హారిక 558 మార్కులతో మొదటి స్థానం సాధించగా, మహాలక్ష్మి 539 మార్కులతో ద్వితీయ స్థానం పొందింది. వారి కృషి, పట్టుదల గ్రామానికి గర్వకారణమని సర్పంచ్ పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించి పాఠశాలకు, గ్రామానికి మరింత పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## అర్బన్ ఫారెస్ట్ పార్క్ సమీపంలో అగ్నిప్రమాదం

- తక్షణమే స్పందించి మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) అర్బన్ ఫారెస్ట్ పార్క్ సమీపంలో మంటలు చెలరేగడంతో వాహనదారులు టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి సమాచారాన్ని తెలియజేశారు. రాత్రి 9 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం తెలియగానే ఘటన స్థలానికి తక్షణమే చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. లేకుంటే అర్బన్ ఫారెస్ట్ పార్కులోకి అగ్ని వెళ్ళినట్లయితే విలువైన ఆస్తి నష్టం తో పాటు పక్షులకు వృక్షులకు తీవ్ర నష్టం జరిగేది. ఈ సందర్భంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనూష మాట్లాడుతూ అర్బన్ ఫారెస్ట్ పార్క్ సమీపంలో మంటలు చెలరేకడంతో తక్షణమే స్పందించి సమాచారం ఇచ్చి నష్టాన్ని నివారించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తక్షణమే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చి నష్టం జరగకుండా కాపాడిన అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలందరూ అడవులను తమ ఆస్తిగా భావించి అడవులను కాపాడుకోవాలని అన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను
## చేర్చాలని అధ్యాపకుల ఇంటింటి ప్రచారం



**ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేర్చాలని కళాశాల అధ్యాపకులు వెంకటాపూర్, కెసిఆర్ కాలనీ, గాజులపల్లెలో కరపత్రాల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కళాశాలలో విశాలమైన తరగతి గదులున్నాయని, ఆర్.ఒ మినరల్ వాటర్ సౌకర్యం కలదని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధన చేస్తున్నారనీ, ఉచిత పుస్తకాలు పంపిణీతో డిజిటల్ బోర్డులద్వారా సి.సి పర్యవేక్షణలో, ఆధునాతన సైన్స్ పరికరాలతో మెరుగైన విద్య అందిస్తున్నామనీ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధవహిస్తామని, ఎస్సీ,ఎస్టీ, బి.సి, ఈ.బి.సి, మైనారిటీ స్కాలర్షిప్ సౌకర్యం కలదని విశాలమైన క్రీడా ప్రాంగణం కలదని, జాతీయ స్థాయిలో ప్రముఖ కోచింగ్ సంస్థలైన ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా( జె.ఇ.ఇ) మొదలగు పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించబడుతున్నాయని, హాజరుకై ముఖ గుర్తింపు (ఎఫ్.ఆర్.ఎస్) ఉంటుందని ఎన్.ఎస్.ఎస్ ,సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు యోగా, మెడిటేషన్,టెలీమానస్, ఆంటీ డ్రగ్, ఒత్తిడి తగ్గించడానికి కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని, పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్ నిర్వహించబడుతాయని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన వారికి బిటెక్, ఫార్మసీలలో ఉచిత విద్య అందించబడుతుందని,వీటన్నింటిని గుర్తించి కళాశాలలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. అధ్యాపకులు వాసరవేణి పర్శరాములు, విద్యార్థులు ఎడ్ల రవికుమార్, గొట్టె వికాస్ కె.అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా
## "అంగారక చతుర్థి" వేడుకలు

- గణనాథున్ని దర్శించుకుని పునీతుడైన భక్తులు



**మంథని (ప్రశ్న న్యూస్)** శ్రీ గణనాథుని పూజిస్తే అంతా శుభం జరుగుతుంది. అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా మంగళవారం గణనాథుని ఆలయాలు భక్తులతో పండుగ వాతావరణం నెలకొంటుంది. దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సంకష్టహర చతుర్థి దీక్షతో తొలగిపోతాయని శాస్త్రాల్లో చెప్పబడింది. కొత్తగా చతుర్థి దీక్ష తీసుకునేవారు అంగారక చతుర్థి రోజున దీక్ష తీసుకోవడం ఎంతో శ్రేయష్కారం. ప్రతి మనిషి తన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష చేపట్టడం అనాదిగా పాటిస్తున్న నియమం. సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో 21 ప్రదక్షిణాలు చేసి మోదకులు ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రావణమాసంలో వచ్చిన అంగారక చతుర్థి ఎంతో విశిష్టమైనది. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గణపతికి ఇష్టమైన వారం మంగళవారం అలాగే నవగ్రహాల్లోని కుజ గ్రహ దోషం పోవాలన్న మంగళవారం వచ్చే అంగారక చతుర్థి రోజున "ఓం గం గణపతియై నమః " అని స్మరిస్తూ విఘ్నేశ్వరున్ని దర్శించుకుంటే అన్ని సంకటాలు తొలగిపోతాయి. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది ఏడాదిలో ఒకసారి మంగళవారం వచ్చే చతుర్థి ని అంగారక అంటారు. ఈ రోజున రాత్రి 9 గంటలకు చంద్రోదయం అనంతరం స్వామివారికి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయష్కారం. ఈ రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్ని తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణత దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రులవుతారు అని శాస్త్రాల్లో పేర్కొనబడింది. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆలయ పూజారి పల్లి రాము భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

# బూతులు లేని రాజకీయాలు సాధ్యమే



(గౌటి రామకృష్ణ -- ప్రశ్న న్యూస్)

## నిరూపించిన దళపతి విజయ్

- దళపతి విజయ్ మాటలే కొత్త శకానికి నాంది
- ఒక్క బూతు మాట మాట్లాడకుండా ప్రభుత్వాన్ని నిలదీసిన నాయకుడు
- స్టాలిన్ అంకుల్ అంటేనే సమస్యలపై చురకలు
- మీరు చేసింది తప్పు, మీరు చేస్తుంది కూడా తప్పే, అది మీకు తెలుసని స్పష్టం
- బూతులు లేకుండా రాజకీయ నాయకుల ప్రసంగాలు తెలుగు రాష్ట్రాలలో సాధ్యమా.?
- తెలుగు రాష్ట్రాల నాయకుల ధోరణి ఇప్పటికైన మారేనా.?
- బూతు మాటలు కుటుంబ సభ్యుల పై ఏడుపులు తప్ప ప్రసంగంలో స్వచ్ఛమైన భాష ఎప్పుడు వింటాం.?

తమిళ సినీ రంగంలో స్టార్ హీరోగా గుర్తింపు పొందిన దళపతి విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేసిన తర్వాత దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారారు. ముఖ్యంగా ఒక్క బూతు మాట కూడా ఉపయోగించకుండా, అభివృద్ధి, ప్రజల సమస్యలపై స్పష్టమైన విమర్శలు చేస్తూ ప్రత్యర్థులను నిలదీసే ఆయన శైలి ఇప్పుడు "కొత్త రాజకీయ సంస్కృతి"గా చర్చకు దారి తీస్తోంది.ఇప్పటి వరకు భారత రాజకీయాల్లో విమర్శ అంటే బూతు పదాలు, వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను దూషించడం, భావోద్వేగాలకు లోనయ్యే ప్రసంగాలు అనే అభిప్రాయం బలంగా ఉండేది. అయితే విజయ్ మాత్రం "మీరు చేసింది తప్పు, మీరు చేస్తుంది కూడా తప్పే, అది మీకు తెలుసు" అనే సరళమైన పదాలతో ప్రత్యర్థులకు గుచ్చుకునే వ్యాఖ్యలతో రాజకీయ నాయకులను ప్రశ్నించారు. ఈ విధానం వల్ల విమర్శ తీవ్రత తగ్గకుండా, స్వచ్ఛమైన భాష మర్యాదపూర్వకంగా ఉండటం విశేషం.తమిళనాడులో ప్రారంభమైన ఈ కొత్త రాజకీయ శైలి, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా చర్చకు దారి తీస్తోంది. యువత ముఖ్యంగా సోషల్ మీడియా వేదికలపై విజయ్ రాజకీయ ప్రసంగాలను విశ్లేషిస్తూ, "ఇలాంటి నిజమైన నాయకత్వం కావాలి" అని అభిప్రాయపడుతోంది. బూతు మాటలు, వ్యక్తిగత దూషణలు లేకుండా కూడా బలమైన ప్రతిపక్షంగా నిలవవచ్చని ఆయన నిరూపిస్తున్నారని భావిస్తున్నారు.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పదజాలం స్థాయి అత్యంత దారుణంగా దిగజారిందనే విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. సభల్లో, మీడియా సమావేశాల్లో పరస్పరం విమర్శించుకునే నేతలు బూతు మాటలు, వ్యక్తిగత దూషణలకు దిగడం సాధారణంగా మారింది. ఈ నేపథ్యంలో విజయ్ చూపిస్తున్న మార్గం సీనియర్, జూనియర్ రాజకీయ నేతలకు గుణపాఠంగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.విజయ్ రాజకీయ ప్రయాణం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, ఆయన చూపుతున్న ధోరణి భవిష్యత్తులో పెద్ద మార్పులకు దారితీయవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజలు కూడా క్రమంగా మార్పును కోరుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి, కొన్ని సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో ఒకే నాయకుడిని గెలిపించడం వల్ల అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందన్న సంగతి తెలిసి కూడా ఓటర్లు వాళ్లని గెలిపించుకొని అభివృద్ధి అనే మాటను శాశ్వతంగా నాశనం చేస్తున్నారు. ప్రస్తుత ప్రజలు ఎంతో ఆలోచిస్తూ అభివృద్ధి, పారదర్శకత, బాధ్యత అనే అంశాలపై చర్చ జరగాలని కోరుకునే ఓటర్లు పెరుగుతున్నారు.తెలుగు రాష్ట్రాల్లో దళపతి విజయ్ ప్రచారాలు, మాటలు ప్రత్యక్షంగా రాజకీయాల్లో మార్పులు తెస్తాయా లేదా అన్నది ఇంకా స్పష్టత లేకపోయినా, ఆయన శైలి మాత్రం ఇప్పటికే ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా యువ ఓటర్లలో "బూతులు లేని రాజకీయాలు సాధ్యమే" అనే నమ్మకం పూర్తిగా పెరిగింది.ఈ పరిణామాల నేపథ్యంలో, భవిష్యత్తులో భారత రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మాటల్లో మర్యాద, విమర్శల్లో స్పష్టత, విధానాల్లో పారదర్శకత అనే మూడు అంశాలు ప్రధానంగా మారితే, అది ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూర్చే అవకాశముంది.మొత్తంగా చూస్తే, తమిళనాడులో దళపతి విజయ్ రాజకీయ శైలి కేవలం వ్యక్తిగత బ్రాండ్‌గా కాకుండా, దేశ రాజకీయ సంస్కృతిలో మార్పుకు నాంది పలికే సూచనగా కనిపిస్తోంది. ఇప్పుడు చూడాల్సింది ఒక్కటే దేశవ్యాప్తంగా బూతులు మాట్లాడే ఇతర నాయకులు ఈ మార్గాన్ని అనుసరిస్తారా.? లేక పాత పద్ధతులకే బూతుల నాయకులుగా పరిమితమవుతారా.? వేచి చూడాలి.

# టీ20 ఫార్మాట్‌లో భారత్ ఆధిపత్యం

## - ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ క్రికెట్‌లో పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. మంగళవారం ఐసీసీ విడుదల చేసిన వార్షిక టీ20 పురుషుల జట్ల ర్యాంకింగ్స్‌లో భారత్ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు 275 రేటింగ్ పాయింట్లతో నంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. గతంతో పోలిస్తే పాయింట్ల ఆధిక్యం కాస్త తగ్గినప్పటికీ, రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ (262) కంటే భారత్ స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. ఆస్ట్రేలియా జట్టు 258 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. మే 2025 తర్వాత ఆడిన మ్యాచ్‌లకు 100 శాతం, గత రెండేళ్ల మ్యాచ్‌లకు 50 శాతం వెయిటేజీ ఇచ్చి ఈ తాజా ర్యాంకులను ఖరారు చేశారు. 2024, 2026లో వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలవడం, ఈ కాలంలో ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ ఓడిపోకపోవడంతో భారత్ స్థానం పటిష్ఠంగా ఉంది.
టాప్ 7 ర్యాంకుల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. న్యూజిలాండ్ (247), దక్షిణాఫ్రికా (244), పాకిస్థాన్ (240), వెస్టిండీస్ (233) వరుసగా 4 నుంచి 7 స్థానాల్లో ఉన్నాయి. శ్రీలంక ఆరు పాయింట్లు కోల్పోవడంతో, బంగ్లాదేశ్ ఒక పాయింట్ సాధించి 8వ స్థానానికి ఎగబాకింది. శ్రీలంక 9వ స్థానానికి పడిపోయింది. ఇక ఇతర జట్ల విషయానికొస్తే, అమెరికా ఆరు రేటింగ్ పాయింట్లు సాధించి 13వ స్థానానికి చేరింది. ఇటలీ 11 పాయింట్లు పొంది మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 23వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. మరోవైపు, మొజాంబిక్ ఏకంగా 15 స్థానాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయింది.

## రైతును రాజు చేసేంత వరకు

# విశ్రమించం

## - సన్న వడ్లకు బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని వెల్లడి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తమది రైతు పక్షపాత ప్రభుత్వం అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హనుమకొండలో జరిగిన 'మెగా రైతు మేళా'లో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి గత ప్రభుత్వం పదేళ్ల సమయం తీసుకుందని కానీ తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నుంచి బయటపడేస్తూనే, రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేసిందని గుర్తుచేశారు. గత హయాంలో 'వరి వేస్తే ఉరి' అన్న పరిస్థితులు ఉండేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు భరోసా కల్పిస్తూ సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వంగా నిలిచిందని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎకరానికి రూ. 12 వేల ఆర్థిక సాయంతో పాటు అత్యాధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 1,200 కోట్లు చెల్లించిందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతును రాజు చేసే వరకు తమ ప్రభుత్వం విశ్రమించబోదని, ప్రతి రైతుకు మద్దతు ధరతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## సికింద్రాబాద్ జోన్‌లో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులపై

# అవినీతి అనుమానాలు

## - జీహెచ్ఎంసి ఆదాయానికి గండేనా.?

- వీళ్ళని నియమించుకున్న ఉద్దేశం ఏమిటి, వీళ్ళు చేస్తుంది ఏమిటి, కమిషనర్ కర్ణన్ కు తెలుస్తుందా.?
-కోర్టు కేసులలో ఇప్పటివరకు కౌంటర్ వెయ్యని వైనం, వీళ్ళ ఉండి ఎవరిని ఉద్ధరించడానికో
- ప్రత్యర్థులతో చేతులు కలిపి జిహెచ్ఎంసి కే వెన్నుపోటు
- చేసే సంస్థకే కన్నె వేసే తరహాలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల వ్యవహారం
- కోర్టుకు అటెండ్ కారు, కౌంటర్ వేయరు, అంతా అవినీతిమయం
- డిప్యూటీ, జోనల్ కమిషనర్లు అసలు పట్టించుకోరు అంతా లోలోపలనే
- స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో అసలు చర్చించని మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించే నా.? వీళ్ళ అవినీతిని కట్టడి చేసేనా.?

పరిస్థితి తెలుసుకొని సూచనలు సలహాలు ఇవ్వకపోవడంతో పాట అంతర్గత ఒప్పందాలు చేసుకొని అక్రమార్కులకు జై కొడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. డిప్యూటీ, జోనర్ కమిషనర్ల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం జరుగుతోందా.? లేకపోతే వారిని కూడా తప్పుదోవ పట్టిస్తున్నారా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం చాలా ఉంది.ముఖ్యంగా, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులపై వస్తున్న అనేక అవినీతి ఆరోపణల్లో "లంచాల వ్యవహారం" కీలకంగా మారింది. కోర్టు కేసుల్లో ఉద్దేశపూర్వకంగా కనీసం కౌంటర్ కూడా వేయకపోవడం, కేసు ఉన్న రోజు కోర్టుకు గైహాజరు కావడం, కావాలని బలహీన వాదనలు వినిపించడం వెనుక ఆర్థిక లావాదేవీలు ఉన్నాయన్న అనుమానం ప్రజల్లో తీవ్రంగా





**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ జోన్‌లో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అక్రమ నిర్మాణాల నియంత్రణ, కోర్టు కేసులలో మున్సిపల్ సంస్థ తరఫున బలమైన వాదనలు వినిపించడం, సంస్థకు న్యాయం చేయడం వంటి కీలక బాధ్యతలు వహించాల్సిన ఈ సభ్యుల పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ప్రయోజనాల కంటే వ్యక్తిగత లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.ప్రస్తుతం సికింద్రాబాద్ జోన్ పరిధిలో నమోదైన కోర్టు కేసుల వివరాలు, వాటిపై స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఇచ్చిన కౌంటర్లు, వాదనలు వంటి అంశాలు స్పష్టంగా బయటకు రాకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. జోనల్, సర్కిల్ అధికారులు ప్రజలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఈ వివరాలు గోప్యంగా ఉంచడం వెనుక అసలు కారణం ఏమిటన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. మున్సిపల్ శాఖ పాలనలో అసలు పారదర్శకత లేకపోవడం వల్ల అవినీతి ఆరోపణలు మరింత బలపడుతున్నాయి.అక్రమ నిర్మాణాల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి కొందరు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు వ్యవహరిస్తున్న తీరు ప్రజలలో తీవ్ర విమర్శలకు గురవుతోంది. మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు భారీగా జరుగుతున్నప్పటికీ వాటిపై కఠిన చర్యలు తీసుకోకుండా, వాటిని సమర్థించే విధంగా కోర్టుకు గైహాజన్ కావడం, కౌంటర్ వెయ్యకపోవడం, కోర్టులో బలహీన వాదనలు వినిపిస్తున్నారన్న ఆరోపణలు చాలా ఉన్నాయి. దీంతో జిహెచ్ఎంసి కేసులు కోర్టుల్లో బలహీనపడుతూ, ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం కలుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల అసలు బాధ్యత జిహెచ్ఎంసి తరఫున న్యాయపరమైన పోరాటంలో విజయం సాధించడం. కానీ ప్రస్తుతం జరుగుతున్నది దానికి పూర్తి విరుద్ధంగా ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలా కేసులలో సమయానికి కౌంటర్ వేయకపోవడం, సరైన ఆధారాలు సమర్పించకపోవడం, కావాలని వాదనల్లో లోపాలు ఉండటం వంటి అంశాలు కోర్టుల్లో జిహెచ్ఎంసి పరాజయాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు.ఇక ఈ వ్యవహారంలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల పాత్రపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులతో జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు సమావేశాలు ఏర్పాటు చేయకపోవడం ఎప్పటికప్పుడు కేసుల నెలకొంది. ఈ ఆరోపణలు నిజమైతే ఇది కేవలం పరిపాలనా లోపం కాదు, నీతి నిజాయితీ నమ్ముకున్న వారిపై నేరుగా దాడి చేసినట్టే అవుతుంది. ఇప్పటికైనాజిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఈ వ్యవహారంపై మౌనం పాటించడం కూడా అనేక సందేహాలకు దారితీస్తోంది. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పై ఇంత పెద్ద స్థాయిలో అవినీతి ఆరోపణలు వస్తున్నప్పటికీ ఏసీబీ విచారణ ప్రారంభించకపోవడం వెనుక కారణం ఏమిటన్నది స్పష్టత కావాలి. ఏసీబీ అధికారులచే పారదర్శక విచారణ జరిపి అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో విశ్వాసం నిలుస్తుంది.మొత్తానికి, సికింద్రాబాద్ జోన్‌లో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల వ్యవహారం జిహెచ్ఎంసి పరిపాలనపై పెద్ద మచ్చ వేస్తోంది. ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేస్తున్నారన్న భావన బలపడుతోంది. వెంటనే పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే జిహెచ్ఎంసి ఆదాయం మాత్రమే కాదు, మున్సిపల్ శాఖ పై ప్రజలకు విశ్వాసం కూడా దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బెంగాల్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం..

## - మోదీకి ట్రంప్ అభినందనలు..
## - అంతర్జాతీయ మీడియా కథనాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ చరిత్రాత్మక, నిర్ణయాత్మక విజయం సాధించింది. ఈ అపూర్వ గెలుపుపై ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందనలు తెలిపారు. ఈ విజయాన్ని వైట్‌హౌస్ "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించింది. "భారత్‌కు మోదీ వంటి నాయకుడు ఉండటం అదృష్టమని, ఆయన నాయకత్వంపై తమకు ఎంతో అభిమానం ఉందని గత నెల ఫోన్ సంభాషణలో ట్రంప్ ప్రధానితో చెప్పారని" వైట్‌హౌస్ ప్రతినిధి కుష్ దేశాయ్ తెలిపారు. ఈ విజయంతో పశ్చిమ బెంగాల్‌లో సుదీర్ఘకాలంగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ 15 ఏళ్ల పాలనకు తెరపడింది. వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం, ఈ ఫలితం ప్రధాని మోదీకి తన మూడో పర్యాయ పాలన మధ్యలో రాజకీయంగా మరింత బలాన్ని చేకూర్చింది. ఈ విజయం అనంతరం ఢిల్లీలో మద్దతుదారులను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. "బెంగాల్ భవిష్యత్తులో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. ప్రజాశక్తి గెలిచింది. బీజేపీ సుపరిపాలన రాజకీయాలకు ప్రజలు పట్టం కట్టారు. పశ్చిమ బెంగాల్ ప్రజలందరికీ నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అని ఆయన అన్నారు. మోదీ ఇప్పటివరకు గెలిచిన అత్యంత కఠినమైన రాజకీయ క్షేత్రాల్లో ఇది ఒకటని బీబీసీ తన కథనంలో పేర్కొంది. ది గార్డియన్ రిపోర్ట్ ప్రకారం, ఇది బీజేపీ నాయకత్వం ఏడేళ్లుగా పన్నిన వ్యూహం ఫలితమని సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌కు చెందిన రాహుల్ వర్మ విశ్లేషించారు. "బెంగాల్‌లో బీజేపీకి బలమైన, వ్యవస్థీకృత నిర్మాణం ఉంది. హిందూ ఓట్ల ఏకీకరణ జరగకుండా ఇంతటి విజయం సాధ్యమయ్యేది కాదు" అని ఆయన వివరించారు. చాలా కాలంగా ప్రాంతీయ, వామపక్ష రాజకీయాలకు కంచుకోటగా ఉన్న బెంగాల్‌లో బీజేపీ విజయం భారత రాజకీయ చిత్రపటంలో ఒక ముఖ్యమైన మార్పు అని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588